


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 14-03-2021 | VIJAYABHANU DAILY ⋆ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 157 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# నేడే ఏపీ మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్..

## నేడు ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం

## 11 కార్పొరేషన్లు, 70 మున్సిపాలిటీల్లో కౌంటింగ్

## హైకోర్టు ఉత్తర్వులతో ఏలూరు, చిలకలూరిపేటలో కౌంటింగ్ ప్రక్రియకు బ్రేక్



అమరావతి: రేపటి మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది. 11 కార్పొరేషన్లు, 70 మున్సిపాలిటీల్లో కౌంటింగ్ జరగనుంది. హైకోర్టు ఉత్తర్వులతో ఏలూరు కార్పొరేషన్, చిలకలూరిపేట మున్సిపాలిటీల్లో కౌంటింగ్ ప్రక్రియకు బ్రేక్ పడింది. హైకోర్టు తుది తీర్పు తర్వాతే ఆ రెండు చోట్ల కౌంటింగ్ చేపట్టనున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత,144 సెక్షన్ ఏర్పాటు చేశారు.

కౌంటింగ్ కోసం కార్పొరేషన్లలో 2204 టేబుళ్లు, మున్సిపాలిటీలలో 1822 టేబుళ్లు మొత్తం 4026 టేబుళ్లు ఏర్పాటు చేశారు. కార్పొరేషన్‌లలో కౌంటింగ్ సూపర్ వైజర్లు-2376, కౌంటింగ్ సిబ్బంది -7412 మంది, మున్సిపాలిటీలలో కౌంటింగ్ సూపర్ వైజర్లు-1941, కౌంటింగ్ స్టాఫ్ సిబ్బంది 5195 మందిని ప్రభుత్వం నియమించింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత కోసం 20,419 పోలీసు సిబ్బంది నియమించారు. ఇందులో 172 మంది డీఎస్పీలు, 476 మంది సీఐలు, 1345 మంది ఎస్ఐలు, 17292 మంది కానిస్టేబుళ్లు,ఇతరులు1134 మందిని ప్రభుత్వం నియమించింది. 11 కార్పొరేషన్లలో స్థానికంగా 16 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు.. విజయనగరం కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు- పాత బస్టాండ్ సమీపంలో రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ విశాఖపట్నం కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు- ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణం,వాల్తేరు విజయవాడ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు- ఆంధ్ర లయోలా కళాశాల మచిలీపట్నం కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు- కృష్ణా యూనివర్సిటీ గుంటూరు కార్పొరేషన్‌లో స్థానికంగా నాలుగు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రభుత్వ టెక్స్ టైల్ టెక్నాలజీ ఇన్ స్టిట్యూట్ న్యూబ్లాక్ -నల్లపాడు లయోలా పబ్లిక్ స్కూల్ -ప్రభుత్వ టెక్స్ టైల్స్ టెక్నాలజీ ఇన్ స్టిట్యూట్ ఓల్డ్ బ్లాక్ -ఒంగోలు కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు- సెయింట్ క్సావియర్ హైస్కూల్ కళాశాల -అనంతపురం కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు -ఎస్ఎస్ బీఎమ్ జూనియర్ కళాశాల -కర్నూలు కార్పొరేషన్‌లో 3 చోట్ల ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేశారు. -రాయలసీమ యూనివర్సిటీ -సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ మహిళా కళాశాల -పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల

-చిత్తూరు కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు - పీవీకెఎన్ ప్రభుత్వ కళాశాల -తిరుపతి కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు - ఎస్ వీ ఆర్ట్స్ కళాశాల మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో ఎక్కడికక్కడ అన్ని వార్డులను కలిపి ఒకే కేంద్రంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## ఐదేండ్లలో అగ్రశ్రేణి ఆటోమొబైల్ హబ్‌గా భారత్!



న్యూఢిల్లీ : రాబోయే ఐదేండ్లలో భారత్ ప్రపంచంలోనే అగ్రశ్రేణి ఆటోమొబైల్ తయారీ హబ్‌గా ఎదుగుతుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో భారత్‌కు మెరుగైన సామర్థ్యం, అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సోలార్ పవర్‌ను ముమ్మరంగా చేపట్టడం ద్వారా సౌర విద్యుత్‌ను ఆటోమొబైల్స్, ఇతర అభివృద్ధి పనుల్లో వాడవచ్చని వ్యాఖ్యానించారు.

దేశవ్యాప్తంగా చిన్న సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల్లో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. ఆత్మనిర్భర్ భారత్-సౌర, ఎంఎస్ఎంఈలో అవకాశాలు అనే అంశంపై జరిగిన వెబినార్‌ను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. మంచి ట్రాక్ రికార్డు కలిగిన ఎంఎస్ఎంఈలను క్యాపిటల్ మార్కెట్‌లోకి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. భారత ఎంఎస్ఎంఈల్లో పెట్టుబడులు పెట్టాలని ఆయన విదేశీ ఇన్వెస్టర్లను ఆహ్వానించారు.

### ఏపీ కౌంటింగ్‌పై ఎస్ఈసీ

## అదనపు మార్గదర్శకాలు



అమరావతి: కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ఆలస్యం కాకుండా చూడాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నిమ్మగడ్డ రమేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాత్రి 8 గంటల్లోగా అన్ని ఫలితాలనూ ప్రకటించేలా చూడాలని సూచించారు. ఈ మేరకు కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అదనపు మార్గదర్శకాలు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని.. ప్రత్యామ్నాయంగా జనరేటర్లు, ఇన్వర్టర్లు సైతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్, వీడియో లేదా సీసీ కెమెరాల ద్వారా చిత్రీకరించాలని తెలిపారు. అంతేకాకుండా కౌంటింగ్ ప్రక్రియ ఫుటేజీని ఎన్నికల రికార్డుగా భద్రపరచాల్సిందిగా ఆదేశించారు.

నిర్దేశిత ప్రమాణాలు, నిబంధనలకు అనుగుణంగా కౌంటింగ్ జరిగేలా చూడాలని రిటర్నింగ్ అధికారులకు ఎస్ఈసీ ఆదేశాలిచ్చారు.

పది కంటే తక్కువ మెజారిటీ సాధించిన సమయంలో మాత్రమే నిబంధనలు, మార్గదర్శకాల మేరకే రీకౌంటింగ్‌కు అనుమతించాలని వెల్లడించారు. రెండంకెల మెజారిటీ వచ్చిన చోట్ల అభ్యర్థి విజ్ఞప్తి మేరకు జిల్లా కలెక్టర్‌ను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల ప్రకటన సమాచారం ప్రజల్లోకి వెళ్లేలా వివరాలు అందించేందుకు మీడియా కోసం ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

## ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోకున్నా కరోనా టీకా




అమరావతి: ప్రభుత్వ, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా కరోనా టీకా తీసుకోవచ్చని ఏపీ వైద్యారోగ్య శాఖ స్పష్టం చేసింది. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోకున్నా వ్యాక్సినేషన్ కేంద్రాలకు వెళ్లి టీకా తీసుకునేందుకు అనుమతిస్తున్నట్టు ఏపీ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ తెలిపారు. 60 ఏళ్లు దాటిన వారు ఏదైనా ధ్రువపత్రం చూపించి టీకా తీసుకోవచ్చొన్నారు. 45 నుంచి 59 ఏళ్ల మధ్య దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్య ధ్రువీకరణ పత్రంతో టీకా పొందచ్చని కమిషనర్ తెలిపారు. వైద్య ధ్రువీకరణ పత్రం లేకున్నా ఇతర ఆధారాలు చూపితే వ్యాక్సినేషన్ ఇస్తారని వివరించారు. ఫ్రంట్‌లైన్ వర్కర్లు ఏ వ్యాక్సినేషన్ కేంద్రానికైనా వెళ్లి టీకా తీసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు.

కొవిన్ యాప్ ద్వారా నమోదు చేసుకున్న వారికే ఇప్పటి వరకు కరోనా టీకా వేస్తున్నారు. వరకు రాష్ట్రంలో 8.39లక్షల మందికి వ్యాక్సిన్ అందించినట్టు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో కరోనా కేసులు తగ్గేసరికి చాలామందిలో

తరువాయి 2లో..

## ఏప్రిల్ 1 నుంచి 12 కొత్త రైళ్లు

విజయవాడ: కరోనా సమయంలో రద్దయిన రైళ్లను ఒకొక్కటిగా పునరుద్ధరిస్తున్నారు. ఇప్పటికే విజయవాడ మీదుగా రోజూ 110 రైళ్లు తిరుగుతున్నాయి. ఏప్రిల్ 1 నుంచి మరో 12 రైళ్లను పునరుద్ధ రించనున్నారు. విజయవాడ-సాయినగర్ షిర్డీ- విజయవాడ (07207/07208) మధ్య రెండు రైళ్లు, అలాగే విజయవాడ- సికింద్రాబాద్-విజయవాడ (02799/02800), విశాఖపట్నం-సికింద్రాబాద్- విశాఖపట్నం (02739/02740), గుంటూరు - విశాఖపట్నం- గుంటూరు (07239/0740), గూడూరు -విజయవాడ-గూడూరు (02734/02644), నర్సాపూర్-ధర్మవరం-నర్సాపూర్ (07247/ 07248) మార్గాల్లో రెండేసి రైళ్ల చొప్పున ఏప్రిల్ 1 నుంచి పునరుద్ధరిస్తున్నారు. షిర్డీ, సికింద్రాబాద్, విశాఖపట్నం, ధర్మవరం, గూడూరులకు విజయవాడ మీదగా రైళ్లు రానున్నాయి. వీటిని ప్రత్యేక రైళ్లుగానే నడుపుతున్నారు.

**రెగ్యులర్ రైళ్ల కోసం ఎదురుచూపులు**

గతంలో 250 రైళ్లు విజయవాడ జంక్షన్ మీదగా ప్రతి రోజూ నడిచేవి. ప్రస్తుతం నడుస్తున్న 110 రైళ్లకు అడ్వాన్సు బుకింగ్ ఇస్తున్నారు. ఈ బుకింగ్‌లు నెల రోజులు ముందుగానే అయిపోతున్నాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరిస్తున్నారే కానీ ప్యాసింజర్ రైళ్లను మాత్రం పునరుద్ధరించలేదు.




# దేశంలోనే తొలి ఏసీ రైల్వే టర్మినల్ రెడీ

బెంగళూరు: విమానాశ్రయం తరహాలో సెంట్రలైజ్డ్ ఏసీ కలిగిన దేశంలోనే తొలి రైల్వే టర్మినల్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ప్రఖ్యాత సివిల్ ఇంజినీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరు మీదుగా బెంగళూరులో ఏర్పాటైన ఈ టర్మినల్ కార్యకలాపాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ శనివారం వెల్లడించారు. దీనికి సంబంధించిన చిత్రాలను ఆయన తన ట్విటర్‌లో పోస్ట్ చేశారు. బెంగళూరులోని బయ్యప్పన్‌హళ్లిలో ఏర్పాటైన ఈ టర్మినల్ ద్వారా బెంగళూరు నగరానికి మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను అనుసంధానం చేయడం వీలు పడుతుందని రైల్వే అధికారులు తెలిపారు. సుమారు ?314 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ టర్మినల్ ఫిబ్రవరి నెలాఖరుకే ప్రారంభం కావాల్సి ఉండగా.. వివిధ కారణాలతో ఆలస్యమైందని చెప్పారు. ఒకసారి ఇది అందుబాటులోకి వస్తే కేఎస్ఆర్ బెంగళూరు, యశ్వంతపూర్ స్టేషన్లపై ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. మొత్తం 4,200 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన ఈ టర్మినల్‌లో రోజూ 50వేల మంది వరకు రాకపోకలు సాగించొచ్చు. మొత్తం ఏడు ప్లాట్‌ఫాంలు కలిగిన టర్మినల్ ప్రాంగణంలో 250 వరకు కార్లు, 900 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకునే వీలుంది. ఎగువ తరగతి వెయిటింగ్ హాల్, వీఐపీ లాంజ్, ఫుడ్ కోర్టు, ఎస్కలేటర్స్,



లిఫ్టులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రెండు సబ్‌వేలు ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

# ప్రైవేటీకరణను జీర్ణించుకోలేకపోతున్నాము

## మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు



తిరుపతి: లక్షలాది మంది జీవితాలతో ముడిపడి ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను కేంద్ర ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను జీర్ణించుకోలేక పోతున్నామని, అందుకే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినట్లు చెప్పారు. రాజీనామాను కొందరు రాజకీయం చేయడం సరికాదన్నారు. పార్టీల కతీతంగా అందరూ ఉద్యమించి ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరారు. విశాఖ ఉక్కును కాపాడుకోవాల్సిన చారిత్రక అవసరం ఉందని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు బాధ్యతను సీఎం జగన్ తీసుకోవాలని, సీఎం చొరవ తీసుకుంటే కలిసి నడుస్తానని చంద్రబాబు స్పష్టం చేశారని గుర్తు చేశారు. చివరి అస్త్రం రాజీనామాలు సంధించే సమయం ఆసన్నమైందన్నారు. ఉక్కు ఉద్యమం లో పవన్ కల్యాణ్ పాల్గొంటే ప్రభావం ఎక్కువగా ఉంటుందని గంటా శ్రీనివాసరావు అన్నారు.

# ఏపీకి అడుగడుగునా అన్యాయం



దిల్లీ : విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తామన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఏపీ పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్ ఆధ్వర్యంలో దేశ రాజధానిలో కాంగ్రెస్ నాయకులు ఇవాళ ధర్నా చేపట్టారు. దిల్లీలోని ఏపీ భవన్ వద్ద కాంగ్రెస్ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించడంతో పాటు ఏపీకి ప్రత్యేకహోదా కోరుతూ ఆ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అడుగడుగునా అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.

"ప్రత్యేకహోదా ఇవ్వలేదు. ఇప్పుడేమో విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తున్నారు. ప్రత్యేక హోదా, ప్యాకేజీపై సీఎం జగన్ ఎందుకు మౌనంగా ఉంటున్నారు. రాష్ట్రానికి రావాల్సినవి రాబట్టుకోవాల్సిన బాధ్యత జగన్‌కు లేదా?జగన్ తమ పార్టీ ఎంపీలతో పార్లమెంట్‌లో పోరాడాలి. అన్ని పక్షాలను ఎందుకు కలుపుకొని విశాఖ ఉక్కుపై పోరాటం చేయలేకపోతున్నారు. వైకాపా ఎంపీలు పార్లమెంట్‌లో ఎన్నో బిల్లులకు భాజపాకు మద్దతు ఇచ్చారు. స్టీల్ ప్లాంట్ విషయంలో ఎందుకు పోరాడలేక పోతున్నారు. గాంధేయ మార్గంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్నాం" అని శైలజానాథ్ ప్రశ్నించారు.

ప్రధాని మోదీ దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను విక్రయించడమే పనిగా పెట్టుకున్నారని నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ నేత కొప్పుల రాజు ఆరోపించారు. నష్టాలను సాకుగా చూపి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని నిర్ణయించారని.. ప్రత్యేక గనులు కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు.

**మొదటి పేజీ తరువాయి**

## ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోకున్న కరోనా టీకా

భయం పోయింది. అసలు కరోనా లేనట్టుగా ప్రవర్తిస్తున్నారు. ఆ అజాగ్రత్తే మరోసారి ముప్పుగా పరిణమించే ప్రమాదం ఉంది. మహారాష్ట్రలో కరోనా మళ్లీ జడలు విప్పింది. ఆ రాష్ట్రంతో పాటు పంజాబ్‌లోనూ ఆంక్షలు విధించారు. అక్కడే కాదు.. మనదగ్గరా మళ్లీ కేసులొస్తున్నాయి. రాష్ట్రంలో శుక్రవారం 210 కేసులు నమోదయ్యాయి. విశాఖపట్నంలోని గోపాలపట్నం జడ్పీ బాలికల ఉన్నతపాఠశాలలో నలుగురు విద్యార్థినులకు కరోనా సోకింది. రాష్ట్రంలో మరోసారి లాక్‌డౌన్ పరిస్థితి రాకూడదంటే ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఆ రూల్ నీకు కూడా వర్తిస్తుందా..

## కోహ్లీపై ధ్వజమెత్తిన వీరూ




న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టీ20లో హిట్ మ్యాన్ రోహిత్ శర్మను పక్కన పెట్టడంపై టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాడు. మ్యాచ్ ప్రారంభానికి ముందు వరకు రోహిత్ శర్మ జట్టులో ఉంటాడని అందరూ భావించినప్పటికీ.. కెప్టెన్ కోహ్లి అనూహ్య నిర్ణయంతో అభిమానులందరూ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. టీ20 ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా రోహిత్ శర్మకు తొలి రెండు టీ20లకు విశ్రాంతినిస్తున్నట్లు టాస్ సమయంలో కోహ్లి ప్రకటించడంతో అంతా అవాక్కయ్యారు.

ఊహించని హఠాత్పరిణామంతో షాక్‌కు గురైన వీరేంద్ర సెహ్వాగ్.. ఆఖరి నిమిషంలో కీలక ఆటగాళ్లకు విశ్రాంతినిస్తున్నట్లు ప్రకటించడం ఎంత వరకు సమంజసమని కోహ్లిని ప్రశ్నించాడు. విశ్రాంతి పేరుతో జట్టులో నుంచి తప్పించే రూల్ నీకు కూడా వర్తిస్తుందా అంటూ కోహ్లిపై ధ్వజమెత్తాడు. కెప్టెన్ విశ్రాంతి తీసుకోకుండా ఇతర ఆటగాళ్లకు ఎందుకు విశ్రాంతినిస్తున్నాడంటూ కోహ్లిపై మండిపడ్డాడు. రోహిత్ లాంటి ఆటగాడు మ్యాచ్‌లో లేకపోతే నా టీవీ ఆటోమేటిక్‌గా ఆఫ్ అవుతుందని పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా రోహిత్‌ను పక్కనపెట్టడం వల్లనే భారత్ ఓటమి పాలైందని టీమిండియా మాజీ క్రికెటర్ అజయ్ జడేజా కూడా సెహ్వాగ్‌తో గొంతుకలిపాడు.

కాగా, రోహిత్ గైర్హాజరీతో బరిలోకి దిగిన భారత జట్టు తగిన మూల్యమే చెల్లించుకుంది. టాపార్డర్ బ్యాట్స్‌మెన్ కేఎల్ రాహుల్(1), విరాట్ కోహ్లి(0), శిఖర్ ధావన్(4) దారుణంగా విఫలం కావడంతో భారత్ స్వల్ప స్కోర్‌కే పరిమితమై 8 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడింది. అయ్యర్(67) రాణించకపోయుంటే భారత్ (నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 127 పరుగులు) మూడంకెల స్కోర్ సాధించడం కూడా కష్టమే అయ్యుండేది.

# మదిని దోచిన మధుర గీతాలు

## - కళాకారుల్ని సత్కరించిన వీసీ జీఎస్ఎన్ రాజు

విశాఖపట్నం : మధుర గీతాలు ప్రేక్షకుల్ని ఊహాలోకంలో విహరింపజేశాయి. భూషణ్ బ్రదర్స్ కల్చరల్ అండ్ ఆర్ట్స్ అసోసియేషన్ 29వ వార్షికోత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం వైశాఖి జల ఉద్యానవనం ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. ఫణిభూషణ్, శశిరాణి పాడిన విన్నానులే ప్రియా, భయ్యా శ్రీనివాస్, సీ.వీ.రాజేశ్వరి పాడిన కోకిలమ్మ పెళ్లికి, వెంకట్, యమున పాడిన కాస్తందుకో దరఖాస్తులో, ఆంజనేయ రెడ్డి, గిరిజ పాడిన ప్రియతమ ప్రియతమా, కృష్ణంరాజు పాడిన రారా కృష్ణయ్యా వంటి పాత, కొత్త మెలికలయికగా ఈ విభావరి అన్ని వయస్సు గల ప్రేక్షకుల మన్ననలు అందుకుంది. తొలుత సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఉప కులపతి డా॥ జి.ఎస్.ఎన్ .రాజు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు.

కార్యక్రమంలో జల ఉద్యానవనం డైరెక్టర్ చింతలపూడి చిట్టిబాబు, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ డి.రుద్రప్రసాద్, వివిధ కళాసంఘాల ప్రతినిధులు డి.భూపతి రాజు, ఎం.వీ.ఆర్.నాగేశ్వరరావు, పి.సూర్యప్రభ, కృష్ణంరాజు, ఫణిభూషణ్, వ్యాఖ్యాత టి.రాధారాణి తదితరులు హాజరై పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు.

# రైతు బాంధవుడు మాదిన ప్రసాద్




శ్రీకాకుళం : మాదిన ప్రసాద రావు రైతు బాంధవుడు అని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డా.ముడిలి జగన్నాథం అన్నారు. పశు సంవర్ధక రంగంలో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందిస్తూ ఎందరో రైతులకు మార్గదర్శి గా, శాఖాపరమైన శిక్షణ అందిస్తూ సిబ్బందికి స్ఫూర్తిప్రదాతగా డా.మాదిన ప్రసాదరావు అన్నదిస్తున్న సేవలకుగాను పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో శనివారం ఘనంగా సన్మానించారు.

ప్రసాద రావు సేవలు అణితరసాధ్యమైనవని జగన్నాథం అన్నారు. ప్రముఖ టివి ఛానల్ లలో అన్నదాత కార్యక్రమం ద్వారా డా.మాదిన ప్రసాదరావు 100 కు పైగా వివిధ అంశాలపై ప్రసంగాలు ప్రసారం కావడం గమనార్హం అని పేర్కొన్నారు. జిల్లాలో పశు సంవర్ధక సహాయకులు పలువురు మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు సేవలను చేయగలుగుతున్నామంటే డా.మాదిన ఇచ్చిన శిక్షణ ద్వారానే సాధ్యమైందని అన్నారు. పలు టీవి కార్యక్రమాలు, ఆయన రూపొందించిన పలు శిక్షణ వీడియోలు ద్వారా సిబ్బంది ఎంతో నేర్చుకుంతున్నారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో మరింత సమర్ధవంతంగా సేవలు అందిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డా.నారాయణ రావు, కిషోర్, డా.వరలక్ష్మి, జిల్లా పశు సంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.


# అందుకే భాజపాతో కలిసి వెళ్తున్నాం : పవన్



అమరావతి: తిరుపతి ఉపఎన్నిక ద్వారా వైకాపా ఆగడాలకు దీటైన సమాధానం చెప్పాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. భాజపా జాతీయ స్థాయి నేతలతో చర్చల తర్వాతనే తిరుపతి ఉపఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థిని బలపరిచినట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తిరుపతిలో విజయం కోసం సమష్టిగా కృషి చేయాలన్నారు. జనసేన అభ్యర్థి పోటీ చేయడం కంటే తిరుపతి అభివృద్ధే ముఖ్యమైనదని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రగతి, శాంతి భద్రతల పరిరక్షణకు తాము తీసుకున్న నిర్ణయం మేలు చేస్తుందని పవన్ అన్నారు. అందరికీ ఆమోదయోగ్యుడైన, బలమైన అభ్యర్థి ఉన్నట్లయితే తప్పకుండా ఆ స్థానాన్ని భాజపాకు అప్పగిస్తామని మొదట్నుంచీ చెప్తూ వచ్చినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలోని ఆలయాలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు భాజపా తగు చర్యలు తీసుకుంటుందనే విశ్వాసం ఉందన్నారు. జనసేన పార్టీ తరఫున ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అది సంస్థాగతంగా బలపడేందుకే అనే విషయాన్ని గమనించాలని కార్యకర్తలకు పవన్ సూచించారు. రాష్ట్రంలోని అరాచక శక్తులను ఎదుర్కొనేందుకే భాజపాతో కలిసి ముందుకు సాగుతున్నట్లు స్పష్టం చేశారు.

## ఆసియన్ అమెరికన్లపై దాడులను ఖండించిన సత్యా నాదెళ్ల



కాలిఫోర్నియా: అమెరికాలో ఆసియన్ అమెరికన్లపై జరుగుతున్న దాడులను మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ఖండించారు. గత ఏడాది మార్చి నుంచి డిసెంబర్ వరకు అమెరికాలో సుమారు మూడు వేల విద్వేష దాడి ఘటనలు చోటుచేసుకున్నట్లు ఆసియన్ అమెరికన్ అడ్వకసీ గ్రూపు పేర్కొన్నది. 2019లో ఆ సంఖ్య కేవలం 216 మాత్రమే ఉన్నట్లు ఎఫ్‌బీఐ నివేదిక చెబుతోంది. ప్రస్తుతం అమెరికాలో నమోదు అవుతున్న విద్వేష ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని సత్యా నాదెళ్ల తన ట్వీట్‌లోపేర్కొన్నారు. వర్ణవివక్ష, ద్వేషం, హింసకు ఈ సమాజంలో చోటులేదని, ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ఆసియన్లు, ఆసియా అమెరికన్ల సమాజానికి అండగా నిలుస్తున్నట్లు సత్యా నాదెళ్ల పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా ఈ దాడుల్ని ఖండించారు. ఆసియా అమెరికన్లపై దాడి దేశ విధానం కాదు అని, దీన్ని ఆపేయాలని బైడెన్ పిలుపునిచ్చారు.

# రేషన్ కార్డుదారుల కోసం కొత్త యాప్

దిల్లీ: ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా రేషన్ సరకులు పొందుతున్న లబ్ధిదారుల కోసం కేంద్రం కొత్త యాప్‌ను విడుదల చేసింది. 'మేరా రేషన్' పేరిట తీసుకొచ్చిన ఈ యాప్ ద్వారా కార్డుదారులు దగ్గర్లోని రేషన్ దుకాణం పేరు, లభించే సరకులు, ఇటీవల జరిపిన లావాదేవీలు వంటి వివరాలు తెలుసుకోవచ్చు. ముఖ్యంగా సొంత ప్రదేశం నుంచి కొత్త ప్రదేశానికి వలస వెళ్లే వారికి ఈ యాప్ ఎంతగానో ఉపయోపడుతుందని వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ వ్యవస్థ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుదాన్షు పాండే వెల్లడించారు.

ఈ యాప్ ద్వారా 'వన్ నేషన్ వన్ రేషన్' కార్డు కింద రేషన్ కార్డు పోర్టబులిటీని కూడా చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు పాండే తెలిపారు.

ప్రస్తుతం 32 రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ విధానం అమల్లో ఉందన్నారు. ఈ యాప్‌ను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) రూపొందించింది. ప్రస్తుతం ఇంగ్లీష్, హిందీ భాషల్లో అందుబాటులో ఉండగా.. త్వరలో 14 భాషల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

వలసదారులు తమ వివరాలను పొందుపర్చడంతో పాటు ఆధార్ సీడింగ్ వివరాలనూ తెలుసుకోవచ్చన్నారు. ఆధార్ లేదా రేషన్ కార్డు నంబర్ ద్వారా యాప్‌లో లాగిన్ అవ్వొచ్చు.

# విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

## - జిల్లా కలెక్టర్ జె.నివాస్




శ్రీకాకుళం : జిల్లాలోని కె.జి.బి.విలలో చదువుతున్న విద్యార్థుల సమస్యలు తెలుసుకొని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ కె.జి.బి.వి సెక్టోరియల్ అధికారులను ఆదేశించారు. కెజిబివిల నిర్వహణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకంగా బాలికల విద్య కోసమే కె.జి.బివిలు స్థాపించబడ్డాయని, వీటికి కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూరుస్తుందని అన్నారు. ప్రతీ 10 మంది విద్యార్థులకు ఒక టీచింగ్ లేదా నాన్ టీచింగ్ స్టాఫ్ ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 32 కెజిబివిలు ఉండగా అందులో 21 కెజిబివిలు ఇంటర్మీడియట్ వరకు విద్యను అందిస్తున్న సంగతిని కలెక్టర్ గుర్తుచేశారు. ప్రతీ కెజిబివిలో సిబ్బంది పూర్తిగా ఉన్నారని కలెక్టర్ చెప్పారు. బాలికల విద్య కోసం ప్రభుత్వం ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ కొన్ని కె.జి.బి.విలలో సమస్యలు తలెత్తుతుండటం విచారకరమని అన్నారు.

విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించడం సెక్టోరియల్ అధికారులపై ఉందని అన్నారు. కెజిబివిలోని విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే విద్యార్థులు నష్టపోయే అవకాశముందని తెలిపారు. కాబట్టి విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులతో పాటు ప్రామాణిక విద్యను అందించాలని సూచించారు.

ప్రతీ కెజిబివి విద్యార్థులు ఐఐటీ, ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఎంపికయ్యేలా వారిని తీర్చిదిద్దాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రతీ కెజిబివిలో గల విద్యార్థుల కదలికలను నిత్యం గమనిస్తూ ఉండాలని, వారికి ఏదైనా సమస్య తలెత్తితే సరియైన సమయంలో ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.


ప్రహరిగోడలు లేని పాఠశాలలకు ప్రహరిగోడలు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్లు ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని,అందుకు అవసరమైన సామగ్రి ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ కె.జి.బి.వి ఒక ఆదర్శ పాఠశాల కావాలని, ఆదిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకొని ముందుకుసాగాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో....

సంయుక్త కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి పైడి వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి కుసుమ చంద్రకళ, ఉప విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, సమగ్ర శిక్ష ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ వెంకట కృష్ణయ్య,జిల్లాలోని కెజిబివి సెక్టోరియల్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో 175 కేసులు.. 2 మరణాలు

## బులెటిన్ విడుదల చేసిన వైద్యారోగ్య శాఖ



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన 24 గంటల్లో 40,448 కొవిడ్ పరీక్షలు నిర్వహించగా.. 175 కేసులు నిర్ధారణ అయ్యాయి. కొవిడ్ వల్ల గడిచిన 24 గంటల్లో చిత్తూరు, అనంతపురం జిల్లాలో ఒక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ బులెటిన్ విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలో నమోదైన మొత్తం కేసుల సంఖ్య 8,91,563కి చేరింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు మరణించిన వారి సంఖ్య 7,182కి చేరింది. ఒక్కరోజు వ్యవధిలో రాష్ట్రంలో 132 మంది పూర్తిగా కోలుకోగా.. ఇప్పటివరకు రాష్ట్రంలో కోలుకున్న వారి సంఖ్య 8,83,113కి చేరింది. ప్రస్తుతం రాష్ట్రంలో 1,268 యాక్టివ్ కేసులున్నట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 1,44,89,098 కరోనా సాంపుల్స్‌ని పరీక్షించినట్లు ఆరోగ్య శాఖ బులెటిన్‌లో వెల్లడించింది.

# పవన్ కళ్యాణ్ పోరాడితే
# ఆ ప్రభావం ఎక్కువగా ఉంటుంది

- గంటా శ్రీనివాసరావు



మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, కొనకళ్ల నారాయణ అండ్ టీడీపీ లీడర్ లాలం భాస్కర్

విశాఖపట్నం : మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు ఇటీవల తన ఎంఎల్ఏ పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఆయన తిరుపతి ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. అందుకే తాను ఎం ఎల్ కె పదవికి రాజీనామా చేసినట్లు చెప్పారు. అయితే తన రాజీనామాను కొందరు రాజకీయం చేస్తున్నారని , అటువంటి చర్యలు సరికాదని చెప్పారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు వ్యతిరేకంగా అందరూ ఉద్యమిం చాలని అన్నారు. ఆ పరిశ్రమను కాపాడుకోవాల్సిన అవ సరం ఉందని తెలిపారు. అందుకోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ ముందుకు రావాలని, ఆయన ఆ బాధ్యతను తీసుకుంటే తానూ కలిసి నడుస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారని అన్నారు. చివరి అసరంగా రాజీనామాలు చేసే సమయం ఆసన్నమైందని తెలిపారు. విశాఖ ఉక్కు ఉద్యమంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పాల్గొంటే దాని ప్రభావం ఎక్కువగా ఉంటుందని అన్నారు.

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, కొనకళ్ల నారాయణ అండ్ టీడీపీ లీడర్ లాలం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 15, 16 న బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు
# సీపీఎం సంపూర్ణ మద్దతు

విశాఖపట్నం : ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రతిపాద నలకు వ్యతిరేకంగా ఈనెల 15,16 తేదీల్లో అఖిలభారత సమ్మె నిర్వహించాలని వివిధ బ్యాంకు సంఘాలతో ఏర్పాటైన యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) తెలిపింది. అలాగే మార్చి 17న జనరల్ ఇన్సూరెన్స్ కార్మికుల సమ్మె, 18న జీవత భీమా సంస్థలు సమ్మె చేయాలని నిర్ణయించాయి. ప్రస్తుతం దేశంలోని 12 బ్యాంకులను మరో విడత విలీనాల పేరిట 4 బ్యాంకులుగా కుదించాలని కేంద్రం బిజెపి ప్రభుత్వం ప్రతిపాద నలు చేసింది. మరో 3 జాతీయ బ్యాంకులు (బ్యాంక్ ఆఫ్ మహా రాష్ట్ర, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)ను ప్రైవేటీకరించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించింది. తక్షణమే అటువంటి ప్రతిపాదనలను కేంద్రం విరమించుకోవాలి. బ్యాంకులను ప్రైవేటీకరించడం వల్ల ప్రాధాన్యత రంగాలకు రుణసౌకర్యం నిలిచిపోతుంది.

పెద్దనోట్ల రద్దు, జిఎస్టి వల్ల ఇప్పటికే ఈ రంగాలన్ని కుదేలయ్యాయి.

ప్రైవేటీకరణతో మరింత దిగజారతాయని సిపిఎం ఆందోళన వ్యక్తం చేస్తున్నది. బ్యాంకుల ప్రైవేటీకరణను నిలవరించేందుకు బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న పోరాటాలకు సీపీఎం విశాఖ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నది.

# చోడవరం వార్త విలేఖరి కి మాతృవియోగం



కాశీ అన్నపూర్ణ (ఫైల్)

చోడవరం : చోడవరం వార్త విలేఖరి, పీసీ సెంటర్ ఇంఛార్జ్, టీడీపీ వార్డు మెంబర్ టి.శ్రీను కి మాతృవియోగం కలిగింది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న శ్రీను మాతృమూర్తి తాన వరపు కాశి అన్నపూర్ణ (63) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు.

ఇంటిలో పెద్ద దిక్కుగా ఉన్న ఆమె మృతిచెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుము కున్నాయి. ఆమె పార్థివ దేహాన్ని స్థానిక టిడిపి నాయకులు, స్థానిక విలేకరులు సందర్శించి నివాళు లర్పించారు.

# విజ్ఞాన్ ఫార్మసీ వారి దత్తత గ్రామంలో ఉచిత వైద్య శిబిరం




గాజువాక : విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ టెక్యాలు, ఎన్ఎస్ఎస్ విభాగం వారిచే వారం రోజుల స్పెషల్ క్యాంపును మార్చి 6 వ తేదీ నుండి 12 వ తేదీ వరకు దత్తత గ్రామం - గాలి సత్తివానిపాలెం, పెందుర్తి మండ లం నందు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నందు విద్యార్థిని, విద్యార్థులకు ప్రథమ చికిత్స, యోగా శిక్షణ, ఉచిత వంత పరీక్షలు నిర్వహించారు.

- పాఠశాల ఆవరణలో మరియు ఇతర ప్రాంతలలో మొక్కలను నాటారు. పరిశుభ్రత,- అంటూ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కిమ్స్ ఇరాన్ హాస్పిటల్ వారి సహకారంతో వృద్ధులకు, ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లాలు ఉన్న వృద్ధులకు ఉచిత కాటరాక్ట్ పరీక్షలు నిర్వహించారు.

- చివరి రోజున ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దానిలో భాగంగా ఉచిత వైద్య పరీక్షలు, ఔషధాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎప్లస్ హాస్పిటల్స్ నుంచి డా.చైతన్య వర్మ విచ్చేసి ఉచితంగా వైద్యం అందించారు. ఈఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా. వై. శ్రీనివాసరావు, ఎలెస్ ప్రోగ్రామ్ ఆఫీర్ డా.ఎన్ - సత్యలక్ష్మి, అధ్యాపకులు మరియు ఎన్ఐఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఛార్టర్డ్ అకౌంటెంట్స్ సమాఖ్య ఆధ్వర్యంలో
# బ్యాంక్ బ్రాంచ్ ఆడిట్ అనే అంశం పై సదస్సు



విశాఖపట్నం : విశాఖపట్నం బ్రాంచ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ సమాఖ్య ఆధ్వర్యంలో బ్యాంక్ బ్రాంచ్ ఆడిట్ అనే అంశం పై శనివారం ఒక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎమ్.పి.ఠాకూర్ ముఖ్య అతిధి గా హాజరై ఛార్టర్డ్ అకౌంటెంట్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ స్టాట్యూటరీ బ్యాంకు ఆడిట్ యొక్క ఉపయోగాలు అందులో ఛార్టర్డ్ అకౌంటెంట్స్ యొక్క పాత్ర మరియు ఆవశ్యకత గురించి వివరించారు. గత సంవత్సరం లో ఆడిట్ చేసిన విధానం పై ఆడిటర్లు ను కోవిడ్ వారియర్స్ గా కొనియాడారు. బ్యాంక్ లు బలోపేతం కావడానికి ఈ ఆడిట్ లు ఎంతో తోడ్పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమములో ప్రముఖ స్పీకర్లు ముంబై నుంచి సిఏ. నిరంజన్ జోషి, ఢిల్లీ నుంచి సిఏ. లోకేష్ గుప్త విచ్చేసి సభ్యులని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్య క్షులు సిఏ. ఎస్. మురళీ కృష్ణ, ఉపాధ్యక్షులు సిఏ.వాసుదేవ మూర్తి, కార్యదర్శి సిఏ. ప్రశాంత్ కుమార్ మరియు కమిటీ మెంబెర్ సిఏ. రామ ప్రసాద్ తో సహా సదస్సు లో మొత్తం 185 మంది సభ్యులు పాల్గొని బ్యాంకు ఆడిట్ మీద అవగాహన పెం పొందించుకున్నారు.

# ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సీపీఎం నిరసన




ములగాడ : నరేంద్ర మోడీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం కాకర్లలోవ, చింతల్లోవ, క్రాంతినగర్, త్రినాథపురం వరకు సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. అనంతపురం త్రినాథపురం జంక్షన్ లో మోడీ దిష్టిబొమ్మను తగులబెట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్య దర్శి వర్గ సభ్యులు ఎం జగ్గు నాయుడు పాల్గొని మాట్లాడుతూ.. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు.

ఇప్పటికే విశాఖ నగరంలో కార్మికవర్గం ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలో చేపడుతున్నారని ఇది విశాఖపట్నంకే పరి మితం కాకుండా రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా మారిందని తెలిపారు. పరిరక్షణ రైతుల సమస్యలు బ్యాంకులు ఇన్సూ రెన్స్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 26న దేశ వ్యాప్త బంద్ ని చేపడుతున్నామని తెలిపారు. ఈ నెల ఐదో తారీకున జరిగిన బంద్ విజయ వంతం అయిందని గుర్తు చేశారు. రేపటి నుండి జరిగే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి ఆర్ లక్ష్మణ మూర్తి, నాయకులు కె పెంటారావు, పి.పైడిరాజు, పిసిని రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బుదిరెడ్డి జన్మదిన వేడుకలు



అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ నాయ కులు బుదిరెడ్డి చిన్న జన్మదిన వేడుకలు శనివారం అభిమానుల సమ క్షంలో ఘనంగా జరిగాయి. గంటా యువసేన ప్రతి నిధులు గంగాధర్, చిన్న తదితరులు పార్టీ కార్యా లయంలో శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి శు భాకాంక్షలు తెలియజసారు. అనంతరం కేక్ కట్ చేసారు. మండలం నలుమూలల నుండి పలువురు టీడీపీ నాయకులు విచ్చేసి, శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపల్లి సత్తిబాబు, గంగయ్య, సూర్యనారాయణ, వీరవెంకట సత్యనారాయణ, రమేష్, అండ్రా ప్రసాద్, బుద్దిరెడ్డి చిట్టిబాబు, నూకు నాయుడు, బయ్యవరం మాణిక్యం, నాయుడుబాబు, బొల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# నాయుడుపాలెం ప్రజలకు ఋణపడి ఉంటా

- పంచాయితీ ప్రజలు నమ్మకాన్ని ఒమ్మి చేయను

- నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి



పరవాడ : పరవాడ మండలము నాయుడుపాలెం పంచాయితీ ప్రజలుకు ఋణపడి ఉంటాను అని నాయుడుపాలెం నూతన సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతా రామయ్య తెలిపారు. శనివారము విజయభాను ప్రతినిధితో మాటాడుతూ నాపై నమ్మకముతో స్దానిక పంచాయితీ ఎన్నికల్లో అత్యదిక మెజార్టితో గెలిపించిన నాయుడుపాలెం పంచాయితీ ప్రజలు నమ్మకాన్ని ఒమ్మి చేయను అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్ని కుల,మత,వర్గ,లింగ విచిక్షిత లేకుండా అందరికీ అందేలా కృషిచేస్తామనీ అన్నారు. ప్రజలుకు ఎప్పుడు ఏటువంటి కష్టమొచ్చినా ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటామనీ అన్నారు. గ్రామాభివృద్ధికి అహర్నిసులు శ్రమిస్తాను అన్నారు.

# గోడ పడి వ్యక్తి మృతి



భీమునిపట్నం : చిట్టివలస జ్యూట్ మిల్ లో శిథిలాలు తీస్తుండగా గోడ పడి ఒక వ్యక్తి మృతి చెందగా,వేరొకరికి గాయాలయ్యాయనీ పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం శ్రీకాకుళం జిల్లా, పొందూరు మండలం,ములకం గ్రామానికి చెందిన కిలారి చంద్రశేఖర్(48), పిట్టా శ్రీనివాస్ లు గత నాలుగు రోజుల క్రితం చిట్టివలస జ్యూట్ మిల్ కు పని నిమిత్తం వచ్చారు. కాగా శనివారం సాయంత్రం జ్యూట్ మిల్ లో శిథిలాలు తీస్తుండగా గోడ చంద్రశేఖర్ మీద పడడంతో చంద్రశేఖర్ అక్కడి కక్కడే మృతి చెందగా, పక్కనే ఉన్న పిట్టా శ్రీనివాస్ కు కాలుపై బలమైన గాయాలయ్యాయనీ పోలీసులు తెలిపారు. మృతదేహం ను పంచనామా నిమిత్తం భీమునిపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఎన్నారై ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతి బ్యాలెట్ ఏజెంట్‌కు చూపాల్సిందే

నర్సీపట్నం : ఓట్ల లెక్కింపు మొత్తం పారదర్శకంగా జరగాలని సంయుక్త కలెక్టర్ (ఆసరా, సంక్షేమం) గోవిందరావు సూచించారు. ఆయన నర్సీపట్నంలో పురపాలక ఎన్నికల సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. సరిగ్గా ఎనిమిది గంటలకు లెక్కింపు మొదలవుతుందని చెప్పారు. తదనుగుణంగా సిబ్బంది కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. లెక్కింపు సమయంలో ప్రతి బ్యాలెట్ పత్రం అభ్యర్థి తరపున ఏజెంట్లకు చూపాలని సూచించారు. ప్రాఫార్మాలన్నీ పూర్తిచేసి రౌండ్ పూర్తి కాగానే ఏజెంట్లకు చూపి సంతకాలు తీసుకోవా లన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. ప్రతి బ్యాలెట్ జాగ్రత్తగా పరిశీలించాలని కోరారు. సబ్ కలెక్టర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ బ్యాలెట్ పెట్టెలు తెరిచిన వెంటనే పత్రాలను 25 చొప్పున కట్టలు కట్టాలన్నారు. పత్రాలపై ఓటు గుర్తును నిశి తంగా పరిశీలించి అనంతరం లెక్కించాలని చెప్పారు. ఓట్ల చెల్లుబాటుకు సంబంధించిన అన్ని విషయాలపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని పేర్కొ న్నారు. కమిషనర్ కనకారావు తదితరులు పాల్గొన్నారు. ఓట్ల లెక్కింపులో సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని జేసీ గోవిందరావు పేర్కొన్నారు.



# విజయభాను సంపాదకీయం

## భాషా పండితులకు సముచిత సత్కారం

ఉన్నతమైన లక్ష్యంతో ముందడుగు వేసేవారు కొందరే ఉంటారు. వారే కార్యసాధకులు. అలాంటివారిలో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ముందువరుసలో ఉంటారు. తాను అనుకున్నది సాధించేవరకు పట్టువదలని విక్రమార్కుడిలా విశ్రమించని కార్యసాధకుడు ఆయన.

ఎన్నో కష్టనష్టాలకోర్చి తన సారథ్యంలో ఉద్యమాన్ని ఉరకలెత్తించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఘనుడు సీఎం కేసీఆర్. వివిధ వర్గాల సమస్యలు తీరుస్తూ వారి అభ్యున్నతికి కృషిచేస్తున్నారు. అదే కోవలో దశాబ్దాలుగా వివక్షకు గురైన భాషాపండితుల ఆశలను సాకారం చేస్తూ ప్రభు త్వ ఉత్తర్వులిచ్చి భాషాభిమానాన్ని చాటుకున్నారు. భాషా పండితులు అనేక సంవత్సరాలుగా అనుభవిస్తున్న వేదనకు తెరదించుతూ, వారికి ఉపశమనం కలిగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు 2, 3 వెలువరించడం పట్ల రాష్ట్రంలోని పదివేలకు పైగా తెలుగు, హిందీ, ఉర్దూ తదితర భాషా పండితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సందర్భం లో విద్యార్థుల శ్రేయస్సు కోసం మరింత పట్టుదలతో కృషి చేస్తామని హామీ ఇస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో సెకండరీ గ్రేడ్ టీచర్ కన్నా మెరుగైన స్కేలు ఉండి గౌరవాన్ని పొందినటువంటి భాషా పండితులను రీ గ్రూపింగ్ ద్వారా స్థాయి తగ్గించినప్పుడు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు పోరాడింది. భాషాపండితులకు గ్రేడ్ వన్ స్కేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను నాటి పాలకులు ఆర్డినెన్స్ ద్వారా తొక్కిపెట్టి అన్యాయం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత తమ కలలు సాకారమవుతాయనే నమ్మకంతో రాష్ట్రీయ ఉపాధ్యాయ పం డిత పరిషత్తు సమస్యలను ముఖ్యమంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లింది.

భాషా ప్రేమికుడైన ముఖ్యమంత్రి 2017లో హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా 2019లో ప్రభుత్వ ఉత్తర్వులు 15ను వెలువరించారు. భాషాపండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్ భాషలుగా అప్‌గ్రేడ్ చేయాలని సంకల్పించినప్పటికీ ఇతర ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లడం వల్ల అది నెరవేరలేదు. అప్పటికి ఉన్న ఉత్తర్వుల ప్రకారం భాషపై పట్టులేనటువంటి ఇతర ఉపాధ్యాయులే స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. భాషా పండితులు అనేకులు పదోన్నతి పొందకుండానే 20 ఏండ్లకుపైగా తక్కువ హోదాతోనే ఉన్నతస్థాయి బోధన చేస్తూ ఉద్యోగ విరమణ పొందారు.

జీవో 11, 12లను సవరించి భాషాపండితులకు న్యాయం చేయాలని విద్యాశాఖ మంత్రి సబిత, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, తదితర నాయకులను, విద్యాశాఖాధికారులను రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు కలిసి విన్నవించింది. మరోమారు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చింది. ఈ నేపథ్యంలో పండితుల జీవితాలలో వెలుగులు నింపుతూ ప్రభుత్వ ఉత్తర్వులు 2, 3లను విడుదల చేయడం విద్యావ్యవస్థలో చరిత్రాత్మకమని చెప్పవచ్చు. ఇందుకు భాషా పండితులు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. భాషపట్ల ఇదే ప్రేమతో భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్ భాషలుగా పూర్తిస్థాయి నియామకం అమలయ్యేంతవరకు వెన్నంటి ఉండాలని కోరుతున్నారు. భాషాపండితులంతా అంకితభావంతో భాషాభివృద్ధికి కృషిచేస్తారని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు హామీ ఇస్తున్నది.

# కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి



శ్రీకాకుళం : జిల్లాలో ఆదివారం జరగనున్న ఇచ్ఛాపురం, పలాస మున్సిపాలిటీలు, పాలకొండ నగర పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జె నివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కౌంటింగ్ ఏర్పాట్లుతో పాటు బందోబస్తు ఏర్పాట్లు కూడా చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ప్రతి మున్సిపాలిటీలో రెండు కౌంటింగ్ హాల్లో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్లను ప్రత్యేక అధికారులుగా నియమించామని చెప్పారు. ఇచ్ఛాపురంకు సుమిత్ కుమార్, పలాసకు డాక్టర్ కే. శ్రీనివాసులు, పాలకొండకు ఆర్.శ్రీరాములు నాయుడును ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమించినట్లు ఆయన చెప్పారు. ఇచ్ఛాపురం లో జ్ఞాన భారతి స్కూల్ లో, పలాసలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, పాలకొండలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాగా పోలీసు శాఖ బందోబస్తును గట్టిగా ఏర్పాటు చేస్తూ మూడు పట్టణాల్లోనూ సెక్షన్ 30 ను అమలు చేయడం జరిగింది. పోలీసు కవాతు లను కూడా పట్టణాల్లో నిర్వహించి బందోబస్తు ఏర్పాట్లు గట్టిగా చేసినట్లు తెలియజేశారు.

పాలకొండలో 18 వార్డులకు ఎన్నికలు జరుగగా 14,600 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలాస - కాశీబుగ్గలో 29 వార్డులకు ఎన్నికలు జరుగగా 31,356 మంది, ఇచ్ఛాపురంలో 23 వార్డులు వార్డులకు ఎన్నికలు జాతుగాగా 20,433 మంది వెరసి 70 వార్డులులో 66,389 మంది అనగా 72.5 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## మున్సిపల్ ఎన్నికల కౌంటింగు కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

### - విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐపిఎస్



విజయనగరం : విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు మున్సి పాల్టీలు, నెల్లిమర్ల నగర పంచాయితీ ఎన్నికల కౌంటింగు కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లుగా విజయ నగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి మార్చి 13, శనివారం నాడు తెలిపారు. కౌంటింగు కేంద్రాల పరిసరాల్లోకి అనుమతి ఉన్న వ్యక్తులను, వాహ నాలను మాత్రమే అనుమతిం చాలన్నారు. కౌంటింగు కేంద్రాలకు 100మీటర్ల దూరంలోనే అనధికార వ్యక్తులను, వాహనాలను నిలిపి వేయాలన్నారు. కౌంటింగు కేంద్రాల వద్ద వాహనాల పార్కింగుకు స్థలా లను కేటాయించా లన్నారు. అతి సమస్యాత్మక వార్డుల్లోను, పోటీ తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసు పికెట్లును ఏర్పాటు చేయాలని, పెట్రోలింగును విస్తృతంగా నిర్వహించాలన్నారు. రాత్రి 10గంటల తరువాత వ్యక్తులెవ్వరూ రోడ్లపై తిరగకుండా చూడాలన్నారు. పోటీ తీవ్రత ఎక్కువగా ఉన్న వార్డులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. కౌంటింగు కేంద్రాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సెక్షను 30 పోలీసు చట్టం మరియు 144 సిఆర్‌పిసి అమలులో ఉన్నందున ప్రజలెవ్వరూగుంపులుగా సంచరించ కూడదని, సభలు, సమావేశాలు, విజ యోత్సవ ర్యాలీలు నిర్వ హించకుండా చర్యలు చేపట్టాలన్నారు. మందుగుండు సామగ్రి కాల్చేందుకు ఎటువంటి అనుమతులు లేవని ముందుగానే పార్టీల నాయకులకు తెలపాలన్నారు. కౌంటింగు కేంద్రాలకు దగ్గరలో నివాసం ఉండేవారు తప్పనిసరిగా తమ వెంట గుర్తింపు కార్డులు తీసుకొని వెళ్ళాలన్నారు. అదే విధంగా వారి నివాసాల్లో కుటుంబ సభ్యులు మినహా ఇతరులెవ్వరూ లేకుండా చూడా లన్నారు. కౌంటింగు కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విజయనగరం మున్సిపల్ ఎన్నికల కౌంటింగు నిర్వహించే రాజీవ్ క్రీడా ప్రాంగణం వద్ద విజయనగరం డిఎస్పీ పి.అనిల్ కుమార్, దిశ మహిళా పిఎస్ డిఎస్పీ టి.త్రినాథ్, నెల్లిమర్ల నగర పంచాయతీ ఎన్నికల కౌంటింగు కేంద్రం వద్ద సిసిఎస్ డిఎస్పీ జె.పాపారావు, ఎఆర్ డిఎస్పీ ఎల్.శేషాద్రి, పార్వతీపురం మున్సిపల్ ఎన్నికల కౌంటింగు కేంద్రం వద్ద అదనపు ఎస్పీ పి.సత్యన్నారాయణరావు, పార్వతీపురం డిఎస్పీ ఎ.సుభాష్, ఎస్సీ మరియు ఎస్టీ సెల్ 2 డిఎస్పీ ఎన్.రామారావు, సాలూరు మున్సిపల్ కౌంటింగు కేంద్రం వద్ద ట్రాఫిక్ పార్వతీపురం ఒఎస్‌డి ఎన్.సూర్య చంద్రరావు, డిఎస్పీ ఎల్.మోహనరావు, బొబ్బిలి మున్సిపల్ కౌంటింగు కేంద్రం వద్ద బొబ్బిలి డిఎస్పీ బి.మోహనరావు, ఎస్సీ మరియు ఎస్టీ సెల్ 1 డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావులు భద్రతను పర్యవేక్షిస్తారన్నారు. విజయనగరం ట్రాఫిక్ సిఐ ఎర్రంనాయుడు మరియు ట్రాఫిక్ సిబ్బంది పట్టణంలో ట్రాఫిక్ రెగ్యులేషను చూడాల్సిందిగా జిల్లా ఎస్పీ బి.రాజకుమారి ఆదేశించారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషను ఎన్నికల కౌటింగు రాజీవ్ క్రీడా ప్రాంగణం వైపు ఇతరుల వాహనాలను అనుమతించబోమన్నారు.

## పిఆర్ కళాశాల సొసైటీ ఉపాధ్యక్షునిగా రాజశేఖర్



కాకినాడ : పిఆర్ జూనియర్ మరియు డిగ్రీ బాలురు బాలికల కళాశాలల ప్రభుత్వ ఉద్యోగుల కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఉపాధ్యక్షునిగా నక్కా రాజశేఖర్ ఎన్నికయ్యారు.ప్రస్తుతం ఈయన ఇదే కళాశాలలో ఆఫీస్ హెడ్‌గా పనిచేయడంతో పాటు రాష్ట్ర ఎస్సీఎస్టీ ఉద్యోగ సంఘాల అధ్యక్షులుగాను ఆల్ ఇండియా రాష్ట్ర ఎసీ,ఎస్టీ మైనారిటీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహారిస్తున్నారు. గతంలో దివంగత మాల మహానాడు అధ్యక్షులు పివి.రావుతో కలిసి ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు.మొదటి నుండి అంబేద్కర్ ఆశయాలతో ముందుకు వెళ్తున్న ఈయన ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు తన వంతు సాయంగా చదువు నిమిత్తం ఫీజులు కట్టడం వంటి కార్యక్రమాలుతో పాటు దూర ప్రాంతాల నుండి ఎవరైనా జిల్లా సామాన్య ఆసుపత్రికి వస్తే వారికి వసతి భోజన సదుపాయాలు కల్పించడం వంటి సేవ కార్యక్రమాలు చేపడుతున్నారు. .రాష్ట్రంలో త్వరలో ఏర్పాటు చెయ్యిబోయే ఎస్సీ కమిషన్‌లో చోటు కల్పించమని రాజశేఖర్ ఇప్పటికే ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి కి లేఖ రాసారు. దీనికి సంబంధించిన పైలు ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయం వద్ద ఉంది.త్వరలో రాజశేఖర్ కు ఎస్సీ కమిషన్‌లో అవకాశం కల్పించేందుకు ప్రభుత్వానికి సుముఖత ఉన్నట్లు సమాచారం.పిఆర్ కళాశాల ప్రభుత్వ ఉద్యోగుల కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఉపాధ్యక్షులుగా ఎన్నికయిన రాజశేఖర్ నుపలువురు దళిత సంఘ నేతలు కలిసి అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు.

# కవి సమయం

## మర్రిచెట్టు

ఊడలు నాటే మర్రిచెట్టులా!
ఎంతో ఘన చరిత్రగలది
కాంగ్రెస్‌పార్టీ
మహావృక్షంలా - వృక్షరాజు ఐ ఉంది
ఈ వృక్ష రాజుకు - చాపక్రింద నీరులా చేరి
అనతికాలంలో ప్రాంతీయ పార్టీలుగా వెలసిల్లే
రెండు నాలుకలతో మాట్లాడే నాగుపాములు
వాడి మీద, వీడు
వీడు మీద వాడు చాడీలు చెప్పుకొనే
దీపావళి టపాస్‌కాయలు
ఒక్కొక్క రాష్ట్రానికి
ఒక్కొక్క కళియుగరావణాసుడు గానో!
నరకాసురుడుగానో! తయారై
కాంగ్రెస్ ప్రగతిని - సుస్థిర స్థానాన్ని
భూస్థాపితం చెయ్యాలని చూస్తున్న
చీడపురుగులు
రాష్ట్రాన్ని - రంపపు కోతకోసి
మధ్య తరగతి కుటుంభీకులను
పీడించే - చండాలులు
వీరి మాటలు - చేష్టలు
విన్నా - కన్నా - చెడుగ ప్రవర్తించినా!
ప్రజాభిష్టంపై - భూస్థాపితం తధ్యం
ఈ సంక్షోభానికి కారకులెవ్వరు?
ఆ వెన్నుపోటు దారులెవ్వరు?
ఈ మధ్య తరగతి కుటుంభీకులను
ఆదుకున్న దెవ్వరు?
నువ్వేగదా! మర్రివిత్తువై ఇంతింతై
అంతై మర్రిచెట్టువై
నీ ఊడలు పెకిలించే నరకాసురులను
పధజర్పిన నాడే - నీ స్థానం - సుస్థిరం

...రచయిత
యల్.సిద్ధా

# పంచాంగం

మాసం : ఫాల్గుణ; తిథి : శు॥పాడ్యమి సా.4.08; ఉత్తరాభాద్ర రా.1.23; వ.ఉ.9.57ల 11.39.

ఆదివారం 14 -02 -2021

a **మేషం** : ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొం టారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది.

b **వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ప్రము ఖులతో పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. మిత్రులతో కలిసి షాపింగ్ చేస్తారు.

c **మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది

d **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోస పోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..

e **సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయా ణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు.

f **కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

g **తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నవ ులు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తితీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

h **వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు.

i **ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

j **మకరం** : ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సాను కూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు.

k **కుంభం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, ఆప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరా స్తుల కొనుగోలు యత్నాలు అను కూలిస్తాయి. మీ ఏమరుపాటుతనం, హడావుడి వల్ల వస్తువులు చేజార్చు కుంటారు. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలు దారు లను ఆకట్టు కుంటారు.

L **మీనం** : ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్యరంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. ఇసుక, భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు ఆటుపోట్లు తప్పవు.



# లక్ష్మీదేవి స్వరూపమైన గోదాదేవి వృత్తాంతం!!

## సంకీర్తన

లక్ష్మీ స్వరూపమైన గోదాదేవి శ్రీరంగంలో క్రీ.శ 776లో జన్మించినట్లు పురాణాలు చెపుతున్నాయి. ద్రవిడ భాషల్లో గోదాదేవికి కోదై, చూడిక్కొడుత్త నాచ్చియార్, ఆండాళ్, అనే నామాంతరములు గలవు. తెలుగు సాహిత్యంలో సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా ప్రఖ్యాతి వహించిన విజయనగర చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు రచించిన తెలుగు ప్రబంధం ఆముక్తమాల్యద గోదాదేవీ వైశిష్ట్యమునకు ప్రతీక. ఈ ప్రబంధానికి విష్ణుచిత్తీయం అనే మరోపేరున్న సంగతి తెలిసిందే.

ఇక గోదాదేవి జన్మ వృత్తాంత్తాన్ని ఓ సారి పరిశీలిస్తే.. శ్రీరంగంలో ఆషాఢ శుద్ధ చతుర్దశిన, పుబ్బ నక్షత్రంలో గోదాదేవి జన్మించింది. గోదాదేవి, శ్రీ విష్ణుచిత్తులకు పూలతోటలో లభించిన కుమార్తె. ఈమెను విష్ణుచిత్తుల దంపతులు చాలా అల్లారుముద్దుగా పెంచుకున్నారు. యుక్త వయస్సులో వచ్చిన తర్వాత లక్ష్మీస్వరూపమైన గోదాదేవి, తన శ్రీవారు అయిన రంగనాథుడినే తన పతిగా పొందాలనుకుంటుంది.

వైష్ణవుడైన విష్ణుచిత్తుడు రంగనాథ స్వామిని ప్రతినిత్యం భక్తిశ్రద్ధలతో కొలిచేవాడు. ఇందులో భాగంగా... ప్రతిరోజూ స్వామివారికి పూలమాలలను సుందరంగా అల్లుకుని అలంకరణకు తీసుకుని వెళ్లేవాడు. అయితే వాటిని గోదాదేవి ముందే ధరించి తర్వాత స్వామివారికి పంపిస్తుంది.

ఈ రహస్యం తెలుసుకున్న విష్ణుచిత్తుడు దుఃఖించి రంగనాథుడికి మాలాధారణ గావించరు. దీంతో స్వామివారి మొహం చిన్నబోతుంది, దీనికంతటికీ తన కుమార్తె తప్పిదమే కారణమని విష్ణుచిత్తుడు బాధపడుతుంటే.. రంగనాథుడు విష్ణుచిత్తునితో ఇక ప్రతిరోజూ తనకు గోదాదేవి ధరించిన మాలాధారనే కావాలని ఆదేశిస్తారు. రంగన్న ఆదేశం మేరకే విష్ణుచిత్తుడు నడుచుకుంటాడు. గంతలో శ్రీరంగనాథుడే తనకు భర్తగా రావాలని కోరుకుంటూ గోదాదేవి... తన తోటి బాలికలతో కలిసి తిరుప్పావై (తిరుప్పావు) వ్రతాచరణ చేస్తారు. ఈ వ్రతమహిమతో... లక్ష్మీ స్వరూపమైన గోదాదేవి శ్రీరంగనాథుడి సతీమణి అవుతుంది. రంగనాథుడి ఆజ్ఞమేరకే గోదాదేవికి, రంగనాథస్వామికి విష్ణుచిత్తుడు దేవేరులకు భూలోకంలో వైభవంగా వివాహం జరిపించాడని పురాణాలు పేర్కొంటున్నాయి. వివాహానంతరం గోదాదేవి ఆ చిద్విలాసునిలో లీనమవుతుంది. అదిచూసి విష్ణుచిత్తుడు దుఃఖితుడైతే మలయప్ప స్వామి జ్ఞానోపదేశం చేస్తాడు. దీంతో విష్ణుచిత్తుడు గోదాదేవి లక్ష్మీస్వరూపి అని, తన కుమార్తె అన్న మాయ నుంచి బయటపడతాడు. ఇకపోతే... గోదాదేవి వ్రతాచరణ సమయంలో రచించిన తిరుప్పావై చాలా ప్రసిద్ధి చెందింది.

దీనిని ధనుర్మాసంలో ప్రతిరోజూ రోజుకొక్కటి చొప్పున ఓ పాశురం వైష్ణవ ఆలయాల్లో పఠించడం చేస్తారు. అందుచేత యువతులు ధనుర్మాసంలో 30 రోజుల పాటు గోదాదేవి వ్రతాచరణ చేస్తే తను మెచ్చిన, సుగుణుడైన భర్త లభిస్తాడని పురాణాలు చెబుతున్నాయి.

## శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి వారి
## కల్యాణ మహోత్సవములు, విశేష సేవా కార్యక్రమములు

విశాఖపట్నం : 'కలౌ వేంకటనాయకః' కలి యుగంలో మానవులను ఉద్ధరించే, సిరు లొలికించే, కోరినంతనే భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారమైన శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీదేవి భూదేవి సమేతంగా మన గ్రీన్ సిటీ లో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం లోభాగంగా విశేష పూజలు, హెూమాలు మరియు శ్రీవారి కళ్యాణ మహోత్సవం విశాఖపట్నం ఆటోనగర్ దారి గ్రీన్ సిటీ లో ఆలయ ప్రాంగణమునాకు అను బంధంగా ఉన్న గ్రీన్ సిటీ ఫంక్షన్ హాలు నందు ఈ నెల 19 నుండి 21 తేదీలలో శ్రీ వైఖానస భాగవత్సాస్త్ర రీత్యా వేదపండితుల ఆధ్వర్యంలో విశేషంగా నిర్వహించసబడును. ఇందులో భాగంగా ప్రతి నిత్యమూ పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, పుష్పయాగం, పూర్ణా హుతి వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిం చబడును. ప్రతి రోజూ సాయంత్రం 4 నుండి 6 గంటవరకు మహా సహస్రావదాని బ్రహ్మ శ్రీ గరికపాటి నరసింహా రావు గారిచే 'శ్రీ వేంకటేశ్వర సుప్రభాత సౌందర్యం అనే అంశం పై ఆధ్యాత్మిక ప్రవచనంప్రత్యేకం. పైకార్యక్రమాలలో పాల్గొన దలచిన వారు శ్రీ ఎర్రాప్రగడ సుబ్రహ్మణ్యం (9912093322) మరియు శ్రీ మధిర రాజశేఖర్ (9989991112)సంప్రదించ గలరు. కావున శ్రీవారి భక్తులు యావన్మంది సదరు కార్యక్రమా లకు హాజరయ్యి భాగవదనుగ్రహానికి పాత్రులు కాగలరు.

## ఇరవైఏళ్ళ కల నేటితో నెరవేరింది

*- అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఋణపడి ఉంటా*

*- తాణాం సర్పంచ్ కన్నూరు వెంకటరమణ దేవి*




పరవాడ : పరవాడ మండలము తాణాం పంచాయితీ ప్రజలుకు ఋణపడి ఉంటాను అని తాణాం నూతనసర్పంచ్ కన్నూరువెంకటరణదేవి అన్నారు. శనివారము విజయభాను ప్రతినిధితో మాట్లడుతూ సుమారు ఇరవై సంవత్సరములు నుండి స్దానిక ఎన్నికల్లో పోటీచేస్తున్నాను అన్నారు. నా ఇరవై ఏళ్ళు కల 21ь2ъ2021వ తేథితో నెరవేరిందనీ అన్నారు. స్దానికసర్పంచ్ ఎన్నికల్లో నాపై నమ్మకముతో అత్యధిక మెజార్టీతో గెలిపించిన తాణాం గ్రామ పంచాయితీ ప్రజలు నమ్మకాన్ని ఒమ్మి చేయను అని అన్నారు. ప్రజలుకు ఎప్పుడు ఏటువంటి కష్ట మొచ్చినా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా మనీ హమీ ఇచ్చారు.

తాణాం గ్రామాభివృద్ధికి అహర్నిశలు కష్టపడ తాను అన్నారు.

తాణాం సర్పంచ్ గా అవకాశము కల్పించనందుకుగానూ తాణాం గ్రామప్రజలు అందరికీ సర్పంచ్ కన్నూరు వెంకటరమణదేవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎండియు పై దాడి చేసిన వ్యక్తి పై కేసు నమోదు

భీమునిపట్నం : రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండియు పై దాడి చేసిన వ్యక్తి పై పోలీసులు కేసు నమోదు చేశారు. భీమిలి తహశీల్దార్ వెంకట ఈశ్వర్రావు ఇచ్చిన వివరాలు ప్రకారం జివిఎంసి2వ వార్డు చిల్లపేట గ్రామా నికి చెందిన ఎండియు ఉప్పాడ దుర్గప్రసాద్ అదే గ్రామంలో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారు. కాగా అదే గ్రామానికి చెందిన ఉప్పాడ దేవా ఎండియు పై దాడిచేసారు. ఈ విషయంను బాధి తుడు తహశీల్దార్ కు చెప్పారు. ఆయన పోలీ సులు కు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు ఉప్పాడ దేవాపై కేసు నమోదు చేసారనీ చెప్పారు. ఈ విషయంపై తహశీల్దార్ స్పందించి ఇకనుంచి ఎవరైనా ఎండియు లపై దాడి చేసినట్లయిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చింతలవీధి సర్పంచ్ దంపతులకు సన్మానం

ఎఐటియుసి ఆధ్వర్యంలో జి.మాడుగుల జిసిసి హమాలీలు



పాడేరు : నూతనంగా చింతలవీధి పంచాయతీ సర్పంచ్ గా ఎన్నికైన వంతల సీతమ్మ ఆమె భర్త మోషే కు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వి. పండుబాబు ఆధ్వర్యంలో జి.మాడుగుల జిసిసి హమాలీలు శనివారం సర్పంచ్ స్వగృహంమందు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వి. పండు బాబు,కె. శ్రీను,కె.సత్తిబాబులు మాట్లాడుతూ మా కుటుంబ సభ్యులుగా మీరు గెలవడం మాకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. మాకు ఎటువంటి సమస్య వచ్చినా మీరు అండగా ఉండాలని వారు కోరారు. మా జీ సి సి హమాలీల తరుపున మీకు ప్రత్యక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. పంచాయతీ ప్రజలకు మంచి పారి పాలన అందించాలని వారు కోరారు. సర్పంచ్ గానే కాకుండా రాబోయే రోజుల్లో మరింత గొప్ప స్థాయిలో ఎదగాలని వారు కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు సీతమ్మ ఆమె భర్త మోషే మాట్లాడుతూ నా కుటుంబ సభ్యులుగా వచ్చే మా దంపతుల ఇద్దరికీ సన్మానం చేయడం మాకు చాలా ఆనందకరంగా ఉందని వారు కొనియాడారు ముందుగా మీకు ప్రత్యేకమైన వందనాలన్నారు.నా పంచాయతీన్నీ అభివృద్ధి చేయడమే నా ముందున్న లక్ష్యంమని, పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానని అన్నారు. మీకు ఎటువంటి సమస్య వచ్చినా నాకు తెలియ పర్చి నట్లయితే మీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే దిశగా చర్యలు చేపడతానని వారన్నారు. ఈ కార్యక్రమానికి వి శ్రీనుబాబు కె బాబురావు,కె. బుజ్జి బాబు, కె. కృపా సాగర్ ఎన్, శివ కుమార్, వి. మధు, కె. మోహన్‌రావు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హుండి లెక్కిస్తున్న దృశ్యం

## దారమల్లేశ్వరస్వామి ఆలయం హుండీ లెక్కింపు

గొలుగొండ : మండలంలో శ్రీశ్రీఉమాదారమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద గత మూడు రోజుల నుంచి మహాశివరాత్రిని పురస్కరించుకొని శనివారం జిల్లా అదనపు దేవాదాయశాఖ కమిషనర్ శాంతి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుండి, టిక్కెట్ల ఆదాయం మొత్తం లక్షా 80వేల 500ల ఆదాయం వచ్చింది. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా వచ్చే ఆదాయాన్ని జిల్లా అధికారులకు చలానా రూపంలో జిల్లా ఉన్నతాధికారులకు అప్పజెప్పడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ ఈవో వెంకట్రాది, ఆలయ కమిటీ అధికారులు, అర్చకులు, పాతమల్లంపేట సర్పంచ్ మామిడి లక్ష్మి, ఆనందం, ఏసిసి చైర్మన్ లెక్కల సత్యనారాయణ, ఆలయ కమిటీ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పుదుచ్చేరిలో పొత్తులు కుదిరాయి

### అభ్యర్థుల స్థానాల్లో తేలేది ఎప్పుడు?

యానాం : కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న ముప్పై నియోజక వర్గాల్లోని ఏప్రిల్ 6వ తేదీన జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీతో బీజేపీ, అన్నాడీఎంకే పార్టీలు పొత్తు కుదుర్చు కున్న విషయం విదితమే 16 స్థానాల్లో ఎన్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీచేసేలా తొమ్మిది స్థానాల్లో బిజెపి నాలుగు స్థానాల్లో అన్నాడీఎంకే ఒక స్థానంలో పిఎంకె పార్టిల అభ్యర్థులు బరిలో దిగే విధంగా మార్చి 8వ తేదీన పొత్తులు ఖరా రయ్యాయి. అయితే ఈ నెల 12వ తేదీ నుండి 19 వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగు తున్నప్పటికీ ఇప్పటి వరకు ఎన్డీఏ పొత్తుల అభ్యర్థుల నియోజకవర్గాలు తేలకపోవడం పుదు చ్చేరి వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది ఈ పొత్తులు కొనసాగేనా ఎవరికి వారిగా ఫ్రెండ్లీగా పోటీలో కి వెళ్లే అవకాశాలు లేకపోలేదని రాజ కీయ విశ్లేషకులు అంటున్నారు అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ, డియంకే, మిత్రపక్షాల పార్టీలు పొత్తులు యధావిధిగా కొనసాగుతున్నాయి శని వారం 15 స్థానాల్లో డిఎంకె అభ్యర్థులు పోటీ చేసే లాగా 12 స్థానాలు కాంగ్రెస్ పార్టీ, మూడు స్థానాల్లో మిత్రపక్షాలు పోటీ చేసేందుకు ఖరారయ్యాయి.

## విశాఖ ఉక్కుప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం



విశాఖపట్నం : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో దేశ రాజధాని న్యూ ఢిల్లీలో ఆంధ్ర భవన్ దగ్గర పెద్దఎత్తున నిరసన ధర్నా...

నాయకులతో పోలీసుల వాగ్వాదం.. అడ్డుకునే ప్రయత్నం .....

మిగతా రాజకీయ పార్టీలు కు స్ఫూర్తినిచ్చింది ఈ కార్యక్రమం.....

ఆంధ్ర ప్రదేశ్ కి ద్రోహం చేసిన వాళ్ల సంగతి ఇక మనం దేశ రాజధాని - న్యూఢిల్లీ రోడ్లమీద తేల్చుకుందాం.

## వేడుకగా సత్యదేవుని ప్రాకార సేవ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం రత్నగిరి వాసుడైన శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారికి శనివారం మాఘ పౌర్ణమి కావడంతో శ్రీ స్వామివారి ప్రాకార సేవ వేడుకగా జరిగింది.

ఉదయం 10 గంటలకు శ్రీ స్వామి, అమ్మవార్లను ప్రధాన రాజ గోపురం వద్దకు తోడ్కొని వచ్చి సర్వాంగ సుందరంగా వివిధ సుగంధ భరిత పుష్పా లతో తీర్చిదిద్దిన వెండి తిరుచ్చిపై ఆశీనులు గావించి, భక్తుల గోవింద నామ స్మరణాలు, మేళతాళాల నడుమ శ్రీ స్వామి, అమ్మ వార్లను ముమ్మారు ప్రధాన రాజగోపురం చుట్టూ ప్రదర్శన గావించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ లక్ష్మణస్వామి మరియు దేవస్థానం అధికారులు, సిబ్బంది, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## 9వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు

భీమునిపట్నం : స్థానిక కృష్ణా కాలనీలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ ఆండాళ్ పద్మావతి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రం 9వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అందువలన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించి వారి కృపకు పాత్రులవ్వాలని కోరారు.

## ఈ నెల 20న బి.సత్యబాబు మృతిపై మెజిస్టీరియల్ విచారణ

### రెవెన్యూ డివిజనల్ అధికారి కె.పెంచల కిషోర్

విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా జి.మాడుగుల మండలం దిగరాపల్లి గ్రామం బట్టి సత్యబాబు తండ్రి రాజులు అను ఆసామిని విశాఖపట్నం సెంట్రల్ జైలు వారు కేజిహెచ్ ఆసుపత్రికి తరలించిన తరువాత వైద్యాధికారుల పర్యవేక్షణలో చికిత్స పొందుతూ 15-10-2020 ఉదయం గం.9-05ని.లకు మరణించినట్లుగా సదరు వైద్యాధికారులు నిర్ధారించి ఉన్నారు. సదరు మరణమును లాకప్ డెత్ గా పరిగణించి మెజిస్టీరియల్ విచారణ జరుపుటకు విశాఖపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ వారిని విచారణ అధికారిగా నియమించి ఉన్నారని సదరు మేజిస్టీరియల్ విచారణ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ,సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ విశాఖపట్నం వారిచే తే.20-3-2021దీన ఉదయం 11 గంటలకు నిర్వహించబడుతుందని తెలియజేశారు. సదరు వ్యక్తి మరణమును గూర్చి తెలిసిన వారు పై విచారణకు హాజరై సమాచారం తెలియజేయవలసిందిగా ఆయన కోరారు.

## ఈనెల 20న యు.వెంకటేష్ మృతి పై మెజిస్టీరియల్ విచారణ

### రెవెన్యూ డివిజనల్ అధికారి కె.పెంచల కిషోర్

విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా సబ్బవరం మండలం వెదుర్లనరవ గ్రామం ఉరుకూటి వెంకటేష్ తండ్రి దేముడు అను ఆసామిని విశాఖపట్నం సెంట్రల్ జైలు వారు కేజిహెచ్ ఆసుపత్రికి తరలించిన తరువాత వైద్యాధికారుల పర్యవేక్షణలో చికిత్స పొందుతూ 9-8-2020 ఉదయం గం.7-45ని.లకు మరణిం చినట్లుగా సదరు వైద్యాధికారులు నిర్ధారించి ఉన్నారు. సదరు మరణమును లాకప్ డెత్ గా పరిగణించి మెజిస్టీరియల్ విచారణ జరుపుటకు విశాఖపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ వారిని విచారణ అధికారిగా నియమించి ఉన్నారని సదరు మేజిస్టీరియల్ విచారణ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, సబ్ విశాఖపట్నం వారిచే తే.20-3-2021దీన ఉదయం గం.11 గంటలకు నిర్వహించబడుతుందని తెలియజేశారు. సదరు వ్యక్తి మరణమును గూర్చి తెలిసిన వారు పై విచారణకు హాజరై సమాచారం తెలియజేయవలసిందిగా ఆయన కోరారు.

## కరోనా వేక్సిన్ వేయించుకున్న గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : ప్రజలు అందరూ కరోనా వ్యాక్సిన్ వేయించుకోవాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి స్థానిక ఆర్. కె హాస్పి టల్లో కరోనా వ్యాక్సిన్ ను వేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రెండవ దశ కరోనా వ్యాప్తి చెందు తున్న తరుణంలో ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండా లని, మాస్కులను ధరించాలని, భౌతిక దూరం పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అన్ని వయస్సుల వారికి కరోనా టీకా అందు బాటులోకి వచ్చింది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

## రత్నగిరి పై దర్శనములకు కోవిడ్ నిబంధనలతో అనుమతి

### - భక్తులు విధిగా కోవిడ్ నిబంధనలు పాటించాలి





అన్నవరం : తూర్పు గోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్య నారా యణ స్వామివారి దేవ స్థానం కు వచ్చే భక్తులకు దేవస్థానం కార్య నిర్వహ ణాధికారి తెలియ జేయునది ఏమనగా కరోనా వైరస్ విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న కారణంగా దేవాదాయ శాఖ ఆఫీసర్ విజయవాడ వారి ఉత్తర్వుల ఆర్.సి.నెంబర్ జె1/286/2020 ది.10-03-2021 మేరకు శ్రీ స్వామి వారి దర్శనార్థమై విచ్చేయు భక్తులు పాటించవలసిన నియమాలు.

1) శ్రీ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా మాస్కులు ధరించి భౌతిక దూరం పాటించవలెను.

2) దేవస్థానం నకు వచ్చే భక్తులు 60 సంవత్సరాలు పైబడిన వారు,10 సంవత్సరాల లోపు పిల్లలు, వికలాంగులు, గర్భిణీ స్త్రీలు, షుగరు, బీపీ, క్యాన్సర్ మరియు ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారు కోవిడ్ రెండవ విడత ప్రబలుతున్నందున కోవిడ్-19 దృష్ట్యా దేవస్థానం వారు సూచించిన నియమాలు పాటిస్తూ దేవస్థానమునకు సహకరించవలసిందిగా కోరుచున్నారు.

3) భక్తులు దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో గుంపులుగుంపులుగా ఉండరాదు మరియు శ్రీ స్వామివారి వ్రతములు, కళ్యాణములు,దర్శనములు పూర్తి అయిన పిదప భక్తులు అందరూ తొందరగా వారి వారి యొక్క స్వగృహము లకు తొందరగా చేరుకొనవలెను.

4) శ్రీ స్వామివారి దర్శనానికి వెళ్ళే భక్తులు వ్యక్తిగత దూరం పాటించుచూ మాత్రమే దర్శనమునకు వెళ్ళవలెను.కావున కరుణ వైరస్ నివారణ చర్యల్లో భాగంగా ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వారు మరియు దేవాదాయ శాఖ వారు దేవాలయంలో తీసుకున్న చర్యలకు భక్తుల సహకరించవలసిందిగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు కోరడమైనది.

## త్రాగునీటి కష్టాలు?



అరకులోయ : మండలంలోని మాడగడ పంచాయతీ హట్ట గూడ గ్రామములో శని వారము కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి శాంతకుమారి పర్యటన చేసి కూడా గ్రామంలో గల పలు సమస్యలపై అడిగి తెలుసుకున్నారు ప్రధానంగా మంచినీటి కష్టాలు చాలా ఉందని ఆ గ్రామస్తులు మహిళలు విన్నవించుకున్నారు. ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు గ్రామంలో 170 గడపలు ఉన్నాయి ఆరు వందల మంది జనాభా నివసిస్తున్నట్లు తెలిపారు ఊట నీరు వర్షాకాలంలో చాలా ఇబ్బందికరంగా ఉంటుంది అన్నారు సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మంచి నీటి సౌకర్యం కల్పించాలని శాంతకుమారి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాగరపు శ్రీను కు జ్యోతిరావు పూలే ఫెలోషిప్ జాతీయ అవార్డ్



గాజువాక : భారతీయ దళిత సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ , 36వ జాతీయ అవార్డ్స్ లో భాగంగా 2020 సంవత్సరం గాను మహాత్మ జ్యోతిబాపూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డు 2020 ను గాజువాక మహాత్మా మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్, ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, చాకిరేవు రజక సంఘ విశాఖ జిల్లా అధ్యక్షులు జాగరపు శ్రీను శనివారం కైవసం చేసుకున్నారు. ఈ అవార్డు ప్రోత్సహించిన వారు నేషనల్ ఫార్మ్ ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ అధ్యక్షులు గురుదేవ్ జి నెల్లి గారు న్యూఢిల్లీ. ప్రజలకు నిరంతరం సేవ చేస్తూ, ప్రజా ప్రయోజనాల కోసం నిరంతరం పాటుపడుతూ మానవతా దృక్పథముతో ఎన్నో సేవా కార్యక్రమాలు, బీసీల సమస్యల పట్ల, రజకులు సమస్యల పట్ల పోరాడి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించే దిశగా చేస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తూ ఎంతమందికి ఆపదలో ఉన్నవారికి విశాఖ జిల్లాలో వేల మందికి రక్తం అందజేస్తున్నారు. ప్రస్తుతం నేషనల్ ఫార్మ్ ఫార్ సోషల్ జస్టిస్ జాతీయ అధ్యక్షులు గురుదేవ్ జి నెల్లి న్యూఢిల్లీ ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్ రావు చాకిరేవు రజక సంఘం ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ పార్థసారథి ప్రోత్సాహం తో జాగరపు శ్రీను ఇలాంటి మంచి మనసు కలిగిన వ్యక్తికి నేషనల్ అవార్డు రావడం మనందరికీ గర్వకారణం మరిన్ని మంచి పనులతో ముందుకు దూసుకుపోవాలని స్థానికులు, అభిమానులు, కోరుకుంటున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు అడ్డుకట్ట వేయండి

## - ఎన్నికలు స్వేచ్ఛగా ప్రశాంతంగా జరిపించండి

## - జిల్లా కలెక్టర్, ఎస్పీలకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐవి వినతి



కాకినాడ : ఈనెల 14న జరుగబోతున్న తూర్పు పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల్లో ప్రలోభాలకు అడ్డుకట్ట వేసి,ఎన్నికలు స్వేచ్ఛగా,ప్రశాంతంగా జరిపించాలని జిల్లా కలెక్టర్,ఎస్పీలకు ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు (ఐ.వి.) వినతి పత్రాలు సమర్పించారు.ఈసందర్భంగా ఐవి మాట్లాడుతూ మార్చి 12 సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం గంధం నారాయణరావు అనే అభ్యర్థికి చెందిన కొంతమంది వ్యక్తులు ఉభయగోదావరి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో కార్లలో, ఆటోలలో ట్రావెలింగ్ బ్యాగ్ లు వేసికొని ఎమ్మెల్సీ ఓటర్లకు పంపిణీ చేస్తూ ప్రలోభ పరుస్తున్నారని పేర్కొన్నారు. కాకినాడ, అమలాపురం, రావులపాలెం వంటి ప్రాంతాల్లో తమ కార్యకర్తలు పంపిణీలను అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.అయితే కొన్ని చోట్ల బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న వ్యక్తులే తమ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని వాపోయారు. ఈరోజు, రేపు కూడా బ్యాగులు, నగదు పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అధికారులు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నామన్నారు. అలాగే పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాల వద్ద కొంత మంది అలజడి సృష్టించే అవకాశం ఉందని, దానిని నిరోధించాలన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిపించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఐవి కోరారు. కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడగా తగిన చర్యలు తీసుకుంటామని ,యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి పెట్రోలింగ్ చేయిస్తామని తెలిపారు.

కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ సిహెచ్.సత్తిబాబుకు, ఎస్పీ కార్యాలయంలో డిఎస్పీ అంబికా ప్రసాద్ కు స్వయం గా వినతి పత్రాలు సమర్పించారు. ఎవరు ఎన్ని ప్రలోభాలు పెట్టినా, వత్తిడి చేసినా ఉభయగోదావరి జిల్లాల అధ్యాపక, ఉపాధ్యాయులు పెద్దల సభ ఔన్నత్యాన్ని, ఉపాధ్యాయుల గౌరవాన్ని నిలబెడతారని ఐవి ఆశాభావం వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో పలివెల వీరబాబు, టి.రాజా, మణికంత, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన అధికారులకు ప్రశంసలు

## - విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐపిఎస్.,




విజయనగరం జిల్లాలో ఫిబ్రవరి నెలలో జరిగిన 3 విడతల గ్రామ పంచాయితీ ఎన్నికలు మరియు మార్చి 10వ తేదీనజరిగిన మునిసిపల్ ఎన్నికలను పటిష్ట బందోబస్తుతో విజయవంతంగాను, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించి నందుకు విజయనగరం జిల్లా పోలీసు ఉన్నతాధికారులను విజయనగరం జిల్లా ఎస్పీ శ్రీమతి బి.రాజకుమారి మార్చి 13, శనివారం నాడు జిల్లా పోలీసు సమావేశ మందిరంలో ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి.రాజకుమారి మాట్లాడుతూ - జిల్లాలో జరిగిన 3 విడతల పంచాయితీ ఎన్నికలను, మునిసిపల్ ఎన్నికలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా నిర్వహించడంలో పోలీసు అధికారులు, సిబ్బంది సమిష్టిగా తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించారన్నారు. రాష్ట్ర డిజిపి గౌతం సవాంగ్, విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎల్.కే.వి.రంగారావు మరియు పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలను, సూచనలను ఎప్పటికప్పుడు పాటిస్తూ, అందరూ సమిష్టిగా పని చేయడం వలన, అధికారుల ఆదేశాలను క్షేత్ర స్థాయి వరకు తీసుకొని వెళ్ళిన నాయకత్వ ప్రతిభ వలనే అన్ని వర్గాల ప్రజల నుండి జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు లభించిందన్నారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లాలో పని చేస్తున్న అదనపు ఎస్పీ, డిఎస్పీ స్థాయి అధికారులను అభినందించి, ప్రశంసా పత్రాలను, ప్రోత్సాహక నగదు బహుమతులను జిల్లా ఎస్పీ అందజేశారు. ప్రశంసా పత్రాలు పొందిన వారిలో (1) ఎస్ఈబి అదనపు ఎస్పీ ఎన్.శ్రీదేవీరావు (2) ఒఎస్డీ ఎన్.సూర్యచంద్రరావు, (3) అదనపు ఎస్పీ (పరిపాలన) పి.సత్యన్నారాయణరావు (4) విజయనగరండిఎస్పీ పి.అనిల్ కుమార్ (5) బబ్బిలి డిఎస్పీ బి.మోహనరావు (6) పార్వతీపురం డిఎస్పీ ఎ.సుభాష్ (7) ట్రాఫిక్ డిస్పీ ఎల్.మోహనరావు (8) సిసిఎస్ డిఎస్పీ జె.పాపారావు (9) దిశా పిఎస్ డిఎస్పీ టి.త్రినాథ్ (10) ఎస్.సి/ఎస్.టి సెల్1 డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు (11) ఎస్.సి/ఎస్.టిసెల్2 డిఎస్పీ ఎన్.రామారావు (12) ఎఆర్‌డిఎస్పీ ఎల్.శేషాద్రి (13) డిసిఆర్‌బి సిఐ డా. బి.వెంకటరావు (13) స్పెషల్ బ్రాంచ్ సిఐ సి.హెచ్.రుద్రశేఖర్‌లు ఉన్నారు.

# రామకృష్ణ మిషన్ విస్తృత సేవలు



విశాఖపట్నం : నేడు వీజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేఖరుల సమావేశములో దేశ వ్యాప్తంగా రామకృష్ణ మిషన్ నిర్వహించిన కార్యక్రమాల 111 వ వార్షిక సాధారణ సమావేశంలో ఆశ్రమ విశాఖ విభాగ నిర్వాహక స్వామి ఆత్మ విధానంద 1897 లో స్థాపించిన స్వామి వివేకానంద రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ 100 సంత్సరాలు పైగా సేవా కార్యక్రమాలను దేశవ్యాప్తంగా సమాజానికి ఉపయుక్తంగా నిర్వహిస్తుందని , ఇప్పటివరకు విద్య, గిరిజన సంక్షేమం, వైద్య, కోవిడ్ సేవలు కోసం 867. 78 కోట్ల రూపాయలు వచ్చిందని అన్నారు.. అనంతరం మాట్లాడుతూ దేశ ప్రజలు అందరికీ తెలిసే విధంగా ఈ నెల ఏడో తేదీన పశ్చిమ బెంగాల్ బేలూరు రామకృష్ణ మిషన్ మఠం లో నిర్వహించిన వార్షిక సమావేశములో సేవ కార్యక్రమాలకు దాతలు ఇచ్చిన సొమ్ముతో పాటూ వివిధ సేవ కార్యక్రమాలకు వినియోగించిన ఖర్చులకు సంబంధించిన నివేదికను పారదర్శకంగా విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 218 కేంద్రాలు భారతదేశంలో, 33 కేంద్రాలు విదేశాలలో విస్తరించి ఉన్నాయని అన్నారు. వార్షిక సాధారణ సమావేశంలో విద్య, కొవిడ్ , గిరిజన సంక్షేమ , వైద్య, సేవలకై 867. 78 కోట్ల రూపాయలు మొత్తంగా వెచ్చించినట్లు పేర్కొన్నారు. కొవిడ్ సేవల ద్వారా 8. 24 లక్షల ప్రజలకు , వైద్య సేవల ద్వారా 83. 11 లక్షల మంది ప్రజలకు , రామకృష్ణ మిషన్ విద్య సంస్థలకు చెందిన 2. 66 లక్షల విద్యార్థులు, గిరిజన సంక్షేమ 5. 73 లక్షల మంది ప్రజలు లబ్ధి పొందినట్లు తెలిపారు. ప్రత్యేకించి ఝూర?ండ్ రాష్ట్ర ప్రభుత్వం రాంచి మొరభది కేంద్రాన్ని నైతిక ఆధారంగా బహుళ నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. చెన్నై స్టూడెంట్స్ హెూమ్ విద్యార్థులకు యాంత్రిక , వాహన రంగ, కంప్యూటర్ ఇంజనీరింగ్ లలో శిక్షణకై నైపుణ్యాభివృద్ధి కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. మంగుళూరు కేంద్రం స్వచ్ఛ భారత అభియాన్ ద్వారా 26 శుభ్రతా కార్యక్రమాలు నిర్వహించి అవగాహనా శిబిరాలు నిర్వహించామన్నారు. సేలం కేంద్రం వారు మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి శానిటైజేషన్ పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారని తెలిపారు. చెన్నై ఆర్ కె మిషన్ మఠం స్వామి వివేకానంద పరివాజక జీవిత విశేషాలతో వివేకానంద హౌస్ లో వర్చ్యువల్ రియాలిటీ ఫిలిం షో ఏర్పాటు చేసారని అన్నారు. దేశంలో పలుచోట్ల భూకంపాలు, తుఫాన్లు, బాధితులకు సహాయం అందిస్తున్నామని తెలిపారు. వృద్దులు, రోగులకు, అనాధలకు, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రులు, వైద్యాలయాలు, సంచార వైద్యశాలలు, విద్య శిబిరాల కోసం 272. 5కోట్ల రూపాయలు వెచ్చించినట్లు తెలిపారు. విశాఖలో రామకృష్ణ మిషన్ మఠం ద్వారా పుట్టుకతో మెదడులో వచ్చే లోపల కారణంగా మానసిక అనారోగ్యం కు గురైన పిల్లలకు ప్రత్యేక ట్రీట్మెంట్ ఇవ్వడం ద్వారా వారిని దత్తత తీసుకొని వారి సంక్షేమం కోసం కృషి చేసినట్లు తెలిపారు. ప్రజల కోసం మరిన్ని నిరంతర సేవ కార్యక్రమాలు చేయడానికి సమాజంలో వున్నా దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు . ఈ సమావేశంలో రామకృష్ణ మిషన్ ఆశ్రమ నిర్వాహకులు స్వామి యోగీశనంద పాల్గొన్నారు.

## ఈనెల 19న

# మంచు విష్ణు హీరోగా 'మోసగాళ్ళు' విడుదల

విశాఖపట్నం : ఢీ, దూసుకెళ్తా, దేనికైనా రెడీ వంటి సూపర్ హిట్ చిత్రాలతో విలక్షణ నటునిగా పేరుతెచ్చుకున్న మంచు విష్ణు నిర్మాతగానూ సక్సెస్‌ఫుల్ చిత్రాలను నిర్మిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. తాజాగా విష్ణు హీరోగా, నిర్మాతగా హై టెక్నికల్ వేల్యూస్‌తో నిర్మించిన చిత్రం మోసగాళ్ళు. ఏవిఏ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి మంచు విష్ణు నిర్మిస్తున్న ఈ చిత్రంలో స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మంచు విష్ణు సోదరిగా నటిస్తోంది. శుక్రవారం విశాఖ వచ్చిన ఈ చిత్రం యూనిట్ కు ఎయిర్ పోర్టులో అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సింహాచలం వరాహలక్ష్మీ నృసింహ స్వామిని మోసగాళ్లు సినిమా కథా నాయకులు మంచు విష్ణు, నవదీప్ దర్శించు కున్నారు. అభిమానుల కోలాహలం మధ్య మధ్యాహ్నం సింహగిరికి చేరుకున్న వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసు కున్నారు. అనంతరం సినిమా విజయవంతం కావాలంటూ స్వామికి పూజలు చేయించారు. తరువాత నగరంలో మెలోడీ థియేటర్లో మోసగాళ్లు మానియా కాంటెస్ట్ విన్నర్స్ తో కలిసి పది నిమిషాల ట్రైలర్ ను వీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హీరో మంచు విష్ణు మాట్లాడుతూ సినిమా ప్రమోషన్ కోసం విశాఖ వచ్చామని, సినిమా విజయవంతం కావాలని సింహాద్రి అప్పన్న స్వామిని ప్రార్థించామన్నారు. ఈ సినిమాకు జఫ్రీ దర్శకత్వం వహించారని తెలిపారు. రియల్ ఇన్సిడెంట్స్‌తో ప్రపంచంలో జరిగిన బిగ్గెస్ట్ ఐటీ స్కామ్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో మార్చి 19న విడుదల చేయనున్నట్లు తెలిపారు.ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టి పాత్ర చాలా పవర్ ఫుల్ పాత్ర పోషించారని, అలాగే నవదీప్, నవీన్ చంద్ర వంటి యంగ్ హీరోలు, వైవా హర్ష లు ఈ సినిమాలో కీలకపాత్రల్లో నటించినట్లు తెలిపారు.

తదుపరి చిత్రం శ్రీను వైట్ల దర్శకత్వంలో నటించనున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. మరో హీరో నవదీప్ మాట్లాడుతూ మంచు విష్ణు ప్రత్యేక శ్రద్ధతో సినిమాను తెరకెక్కించారని, యధార్థగాథ ఆధారంగా తీసిన ఈ సినిమాను ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని, మంచి సక్సెస్ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విష్ణు, నవదీప్ లను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు.

## ఉప్ప ఆసుపత్రిలో సోమవారం నుంచి

# కోవిడ్ వ్యాక్సిన్ అందుబాటులోకి...



అరకులోయ : హుకుం పేట మండలం కేంద్రంలో గల ఉప్ప ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోవిడ్ వ్యాక్సిన్ అందుబాటులో నున్న కారణంగా 45 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపున్న వారికి థైరాయిడ్, షుగరు, బీపీ, మొదలగు దీర్ఘకాలిక వ్యాధు లున్నటు వంటి ప్రజలు ముందుగా వైద్యులు సలహా, సూచనలు మేరకు 15వతేదీ సోమవారం ఉదయం 10 గం.నుంచి ఉప్ప ఆసుపత్రికి వచ్చి కోవిడ్ వ్యాక్సిన్ వేసుకోవ లసిందిగా వైద్యాధి కారులు డాక్టర్ అనూష, ప్రశాంత్ లు తెలిపారు.

# సఫీస్ట్ డార్క్ ఫాంటసీ దశాబ్ద వార్షికోత్సవ వేడుకలు

విశాఖపట్నం : మార్కెట్ కు కొత్త రుచులను పరిచయం చేస్తూ మార్గదర్శకంగా నిలవడంలో డార్క్ ఫాంటసీ పది సంవత్సరాలు పూర్తి చేసుకుందని, తన పోర్ట్ ఫోలియోను విస్తృత పరచుకుంటూ సరికొత్త వినియోగ సందర్భాలకు సరిపోయే విధంగా సిద్ధమవుతోందని సంస్థ చీఫ్ అలీ హారిస్ షేర్ తెలిపారు. ఐటీసీ కు చెందిన సన్ ఫీస్ట్ యొక్క డార్క్ ఫాంటసీ ప్రీమియం కుకీ బ్రాండ్స్ లో ఒకటని, ఒక దశాబ్దం క్రితం తన ముఖ్య ప్రొడక్ట్ అయిన డార్క్ ఫాంటసీ చాకో ఫిల్స్ సెంటర్ ఫిల్డ్ కుకీ రుచిని పరిచయం చేసిందన్నారు.

సర్ఫేస్ట్ డార్క్ ఫాంటసీ రెండో దశాబ్దంలో ఇంకో ముందడుగు వేసి సరికొత్త జోడింపులు, సమూల మార్పులతో ముందకు సాగుతుందని చెప్పారు.

# వెలుగు నీడలు సహజమైనవి : డా.చప్పిడి



కాకినాడ : వెలుగు నీడలు సహజమైనవని, జీవితంలో కష్టసుఖాలు సాధారణంగా వెలుగు నీడలవలే వచ్చిపోతుం టాయని హెల్త్ అవేర్ సంస్థ అధ్యక్షులు, అలయన్స్ క్లబ్ అంతర్జాతీయ సలహాదారు అలై. డా.చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. దీప్తి సునైన సాయిశ్రీ జన్మదినం పురస్కరించుకుని కోరంగి దుర్గమల్లేశ్వర వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం చేసారు.ఈ సందర్భంగా డా.చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ధైర్యంగా ఆత్మ విశ్వాసంతో మెలగాలని, పిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి రావాలని కోరారు.ఈసందర్భంగా ఆశ్రమం నిర్వాహకులు పొన్నాడ రాంబాబు మాట్లాడుతూ పెద్దల పట్ల, వృద్ధుల పట్ల, గౌరవంగా మెలగాలని కోరారు.

వృద్దులకు అన్న దానం నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే జన్మదినం జరుపుకున్నటు వంటి దీప్తిని అందరితరపున అశ్వీర్వదించారు. కార్యక్రమంలో వనుం ఉపేంద్రనాథ్, అనంత రాజ్య లక్ష్మి, పేమ్మాడి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్

## ఓటర్లతో మాట్లాడుతున్న హరిజవహర్‌లాల్



విజయనగరం : పుర ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ తెలిపారు. నగరపాలక సంస్థ 5వ వార్డులో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రక్రియను ఆయన పరిశీలించారు. కేంద్రాలను సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నెల్లిమర్ల మినహా మిగిలిన నాలుగింటికి ప్రత్యేకాధికారులను నియమించా మని, వీరంతా కౌంటింగ్‌ను పర్యవేక్షిస్తారని చెప్పారు. కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తామన్నారు. ప్రశాంతంగా లెక్కింపు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. నగరపాలక కమిషనరు ఎస్ఎస్ వర్మ, తహసీల్దారు ఎం.ప్రభాకరరావు పాల్గొన్నారు.

# బరువు తగ్గించే కొబ్బరినూనె!



కొబ్బరినూనె సాధారణంగా ప్రతి ఇంటిలోను వాడుతూంటారు. కొబ్బరి నుండి తీసే ఈ నూనెలో అనేక ఔషధ మరియు ఆహార ప్రయోజనాలున్నాయి. కొబ్బరినూనెతో అనేక వంటకాలు కూడా చేస్తారు. కొబ్బరి చెట్లు అధికంగా వుండే కేరళ వంటి రాష్ట్రంలో కొబ్బరినూనె వాడకం ఎంతో విరివిగా చేస్తారు. కొబ్బరినూనె దాని రుచికే కాక, బరువును తగ్గించేందుకు కూడా వాడతారు. బరువు తగ్గాలనుకునేవారికి సరైన వంట నూనె కొబ్బరినూనె. మరి కొబ్బరి నూనె బరువును ఎలా తగ్గిస్తుందనే అంశంపై కొన్ని వాస్తవాలు పరిశీలించండి.

**బరువు తగ్గేటందుకు కొబ్బరినూనె వాడకం ..**

1. కొబ్బరి నూనె తేలికగా జీర్ణం అవుతుంది. దానికి కారణం అందులో ఫ్యాటీ యాసిడ్లు తక్కువ కనుక తేలికగా జీర్ణం అయిపోతుంది. శరీరంలో కొవ్వు నిల్వలు ఏర్పడకుండా కూడా వుంటుంది.
2. కొబ్బరినూనెలోని ట్రిగ్లీ సెరైడ్స్ జీవక్రియను పెంచి, ఫ్యాటీ యాసిడ్లను శక్తిగా మారుస్తాయి.
3. కొబ్బరి నూనె వాడకం ద్వారా మీరు తినాలనే కోరికలను తగ్గించుకోగలరు. ఈ నూనెలో కార్బోహైడ్రేట్లు అధికం. కేలరీలు అధికంగా వుండి ఆకలిని నియంత్రిస్తాయి.
4. బరువు తగ్గాలంటే మీ ఆహారంలో కొబ్బరి నూనె తప్పక చేర్చండి. వంటనూనెలలో ఆహారాలు వేయించే బదులుగా కొబ్బరి నూనె లో వేయించి మార్పు గమనించండి.
5. మీ లోని జీవ క్రియ పెంచేటందుకుగాను వ్యాయామానికి ముందు ఒక టేబుల్ స్పూన్ కొబ్బరినూనె ఒక గ్లాసు వేడి నీటిలో వేసి తాగితే బరువు కూడా తగ్గుతుంది.
6. కొబ్బరినూనె జీర్ణక్రియ మెల్లిగా జరిగేలా చేసి ఆకలి లేకుండా చేస్తుంది. అంతేకాదు రక్తంలోని బ్లడ్ షుగర్ స్థాయిలను నియంత్రిస్తుంది.
7. బరువు పెరగటం, ఆకలి, అలసటలకు సంబంధించిన కేండిడా అనే ఒక ఈస్ట్ ను కొబ్బరినూనె అరికడుతుంది.
8. కొబ్బరినూనెనుండి ప్రయోజనాలు అధికంగా పొందాలంటే, దానిని రీఫైన్ చేయరాదు. స్వచ్ఛమైన కొబ్బరి నూనెను మాత్రమే వాడాలి. కనుక బరువు తగ్గాలనుకునేవారు తమ ఆహారంలో రుచికరమైన కొబ్బరినూనె చేర్చి బరువు, ఆరోగ్యం రెండూ పొందవచ్చు.



# మహిళల ఆరోగ్యకరమైన ఆహారాలు!

ఆరోగ్యకరమైన ఆహారాలు అంటే సహజంగా పచ్చటి కూరగాయలు, ఆకుకూరలు, తాజా పండ్లు, గింజధాన్యాలు, పప్పులు మొదలైనవిగా వుంటాయి. అయితే, కొంతమంది మహిళలకు 30 సంవత్సరాల వయసు పైబడినవరికి విటమిన్లు, ప్రొటీన్లు అధికంగా వుండే ఆహారాలు కావాలి. వ్యాధులతో పోరాడటానికి, సంతానోత్పత్తికి, ఆరోగ్యకరమైన శరీరంకొరకు వీరికి ఈ ఆహారాలు ప్రధానం. మీరు కనుక 30 సంవత్సరాలుపైబడిన మహిళలైతే, విటమిన్లు, ప్రొటీన్లు అధికంగా వుండే ఆహారాలను మీ రోజువారీ ఆహారంలో తప్పక చేర్చండి.

**30 సంవత్సరాలు పైబడిన మహిళలకు ఆహారం!**

ఐరన్ అధికంగా - మహిళ ప్రతినెలా తన శరీరంనుండి పిరియడ్ కారణంగా కొంత ఐరన్ నష్టపోతుంది. ఐరన్ తగ్గితే అది మిమ్మల్ని బలహీనపరచి శరీరంలో రక్తహీనత ఏర్పరుస్తుంది. ఐరన్ అధికంగా వుండే ఆహారాలు, అలసట పోగొట్టి, రక్తహీనత, జుట్టు రాలటం, తలనొప్పి వంటివి కలిగించకుండా వుంటాయి. పచ్చని కూరలు, ఆకు కూరలు, బచ్చలి, గోంగూర, బీన్స్ వంటి వాటిలో ఐరన్ అధికం. లివర్, టూనా చేప కూడా అధిక ఐరన్ కలిగి వున్నాయి.

పండ్లు - 30 సంవత్సరాలు పైబడిన మహిళకు పచ్చి లేదా తాజా పండ్లు మంచి పోషకాలనిస్తాయి. వీరికి ఐరన్, కాల్షియం రెండూ ప్రధానం. బొప్పాయి, బఠాణీ, ఆలివ్, స్ట్రాబెర్రీ, ఆరెంజ్, కేన్ బెర్రీలు జంక్ ఫుడ్ బదులుగా తినండి. ఆకలి, అలసటలను వదలాలంటే పండ్లు తినాలి కాల్షియం - విటమిన్ డి, మెగ్నీషియంలతో ఇది వస్తుంది. 30 సంవత్సరాల పైన మంచి కార్బోహైడ్రేట్లు, కొవ్వులు మిమ్మల్ని రక్తపోటునుండి, గుండె జబ్బులనుండి కాపాడతాయి. కొవ్వు తక్కువగా వున్న పాల ఉత్పత్తులు, గోంగూర, బచ్చలి, వేపిన చేపలుసల్మాన్, టూనా, కొవ్వు తక్కువవుండే జున్ను, గుడ్లు, వెన్నతీసిన పాలు , గింజలు తినాలి. జంతు సంబంధిత ప్రొటీన్లు శరీరంనుండి కాల్షియం తీసుకుంటాయి. కనుక వీటిని తగ్గించండి. సాధ్యమైన మేరకు మొక్కల సంబంధిత ఆహారాలు తినాలి.

కొవ్వులు - చెడు కొల్లెస్టరాల్ తగ్గాలంటే మోనోశాట్యురేటెడ్ ఆహారాలు తినాలి. ఇవి గుండె జబ్బులు, రక్తపోటు, షుగర్ వ్యాధి రాకుండా చేస్తాయి. బాదంపప్పులు, జీడిపప్పులు, బీఫ్, ఓట్ మీల్, పస్తా, బ్రౌన్ బ్రెడ్, వాల్ నట్స్, నువ్వులు, గుమ్మడి గింజలు మొదలైనవి మోనో శాట్యురేటెడ్ కొవ్వులు కలిగి వుంటాయి. మొక్క సంబంధిత నూనెలు ఆలివ్ నూనె, కెనోలా నూనె, గ్రేప్ సీడ్ నూనె, అవిసె గింజల నూనె మొదలైనవి కూడా 30 ఏళ్ళ మహిళలకు మంచివే. ఈ వయసు మహిళలు, ఆహారం ఒకటే తీసుకుంటే చాలదు. శారీరక సౌష్టవం కొరకు క్రమం తప్పకుండా కొంత సమయం రోజూ వ్యాయామం కూడా చేయాలి. తగినంత నీరు తాగి శరీరంలోని మలినాలు విసర్జించాలి.





# నడుము నొప్పి అపోహలు

మనలో చాలామంది ఎప్పుడో ఒకప్పుడు నడుము నొప్పి బాధను అనుభవించినవారే. ప్రతి 10 మందిలో కనీసం 8 మంది ఏదో సమయంలో దీని బారినపడుతున్నట్టు అంచనా. ఈ నడుము నొప్పిపై అపోహలూ ఎక్కువే. వ్యాయామం చేస్తేనో, బరువులు ఎత్తితేనో నడుము నొప్పి వస్తుందని ఎంతోమంది అనుకుంటూ ఉంటారు. ఇది వస్తే పూర్తిగా మంచంపై విశ్రాంతి తీసుకోవాల్సిందేనని భావిస్తుంటారు. అసలు ఇలాంటి అపోహల్లో నిజమెంతో తెలుసుకుందామా...

**ఎప్పుడూ నిటారుగానే కూచోవాలి:**

ముందుకు వంగి కూచోవటం వల్ల వెన్నెముకకు హాని కలుగుతుందన్నది నిజమే. కానీ పూర్తి నిటారుగా, చాలాసేపు అలాగే కూచున్నా వెన్నెముక త్వరగా అలసిపోతుంది. కాబట్టి ఎక్కువ సమయం కూచోవాల్సి వస్తే.. కుర్చీ వెనక భాగానికి వెన్ను ఆనించి, కొద్దిగా ముందుకు వంగి కూచోవాలి. కాళ్లు నేలను తాకుతుండేలా చూసుకోవాలి. ఎప్పుడూ కూచునే ఉండకుండా.. గంటకోసారి లేచి కాస్త అటా ఇటా నడవటం.. ఫోనులో మాట్లాడటం వంటి పనులను నిలబడే చేస్తుండటం మంచిది.



**మరీ బరువైన వస్తువులను ఎత్తరాదు:**

ఎవరికైనా శక్తికి మించిన బరువులను ఎత్తటం శ్రేయస్కరం కాదు. అయితే నడుమునొప్పి విషయంలో ఎంత బరువు ఎత్తుతున్నామన్న దానికన్నా ఎలా పైకి లేపుతున్నామన్నదే కీలకం. ఆయా వస్తువులను దూరం నుంచి వంగి ఎత్తటం కాకుండా.. వాటికి దగ్గరగా వచ్చి మోకాళ్ల మీద కూర్చుని పైకెత్తాలి. వెన్ను నిటారుగా ఉండేలా, శరీరం బరువు కాళ్లపై సమంగా పడేలా చూసుకోవాలి. ఈ సమయంలో శరీరం పక్కలకు తిరిగినా, వంగినా వెన్నెముకను దెబ్బతీస్తుంది.

**పూర్తి విశ్రాంతి తీసుకోవటమే మంచి చికిత్స :**

చిన్న చిన్న గాయాలు, బెణుకుల వంటి కారణంగా హఠాత్తుగా నొప్పి వస్తే విశ్రాంతి తీసుకోవటం మంచిదే. అయితే పూర్తిగా మంచం మీదే పడుకోవాలనేది మాత్రం అపోహ. ఒకట్రెండు రోజులు కదలకుండా పూర్తిగా మంచం మీదే ఉండిపోతే నడుము నొప్పి మరింత ఎక్కువ అవుతుంది.

**గాయాల వల్లనే నొప్పి కలుగుతుంది :**

ఒక్క గాయాలే కాదు.. వయసుతో పాటు వచ్చే వెన్నుపూసల అరుగుదల, రకరకాల కండరాల సమస్యలు, ఇన్‌ఫెక్షన్లు, జన్యు పరమైన కారణాల వంటివి కూడా నడుము నొప్పికి కారణమవుతాయి.

**బక్క పలుచని వారికి నొప్పి రాదు :**

బరువు ఎక్కువ ఉన్న వారికి నడుమునొప్పి బాధలు ఎక్కువన్న మాట నిజమేగానీ అలాగని బక్కగా ఉండే వారికి నడుము నొప్పి రాదనుకోవటానికి లేదు. నడుము నొప్పి ఎవరికైనా రావొచ్చు. నిజానికి ఆహారం సరిగా తీసుకోకుండా చాలా సన్నగా ఉండేవారికి ఎముక క్షీణత ముప్పు ఎక్కువే. ఇలాంటి వారికి నొప్పులే కాదు, వెన్నెముక విరిగే ప్రమాదమూ ఉంటుంది.

**వ్యాయామం వెన్నెముకకు హాని చేస్తుంది :**

ఇది చాలా పెద్ద అపోహ. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే వెన్నునొప్పి రాకుండా నివారించుకునే వీలుంది. తీవ్ర

గాయాల కారణంగా వెన్నునొప్పితో బాధపడుతున్నవారికి వెద్యులు ప్రత్యేక వ్యాయామాలు సూచిస్తారు. ఇక నొప్పి తగ్గిన తర్వాత తగు వ్యాయామాలు చేయటం ద్వారా మున్ముందు మళ్లీ నడుము నొప్పి బారినపడకుండా చూసుకోవచ్చు.

**నిర్లక్ష్యానికి మూల్యమెక్కువ**

నడుము యాంజెనాకు సరైన చికిత్స చేయించకుండా నిర్లక్ష్యం చేస్తే.. పురుషాంగానికి రక్తప్రసరణ మందగించి, సామర్థ్య సమస్యలు తలెత్తవచ్చు. రెండో సమస్య- పాదాలకు రక్తప్రసరణ తగ్గిపోవటం. దీనివల్ల పాదాల్లో తీవ్రమైన నొప్పితోపాటు కండ నల్లబారటం, గ్యాంగ్రీన్ వంటి సమస్యలు తలెత్తుతాయి. సెక్సు సామర్థ్యాన్ని పదిల పరచుకోవటానికీ, పాదాల్ని పరిరక్షించుకోవటానికి మధుమేహులు నడుము యాంజెనా విషయంలో నిరంతరం జాగ్రత్తగా ఉండాల్సిందే.

**పెయిన్ కిల్లర్లు వద్దు:**

నడుము నొప్పితో బాధపడేవారు.. తరచూ డాక్టర్లను మార్చేస్తుంటారు. దీనితో వారు వాడే నొప్పినివారిణ మాత్రల (పెయిన్ కిల్లర్లు) బ్రాండ్లు కూడా ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి.

కొంతమంది డాక్టర్ని సంప్రదించటానికి బదులుగా, తమకు తామే నేరుగా మందుల దుకాణానికి వెళ్లి పలురకాల మాత్రల్ని తెచ్చుకుని వాడేస్తుంటారు. ఏ కొంచెం నొప్పిగా, నలతగా ఉన్నా వెంటనే మాత్ర వేసేసుకుంటారు. ఇలా పెయిన్ కిల్లర్లను ఏళ్ల తరబడి విచ్చలవిడిగా వాడటం వల్ల రెండురకాలుగా నష్టం వాటిల్లుతుంది. ఎలాగంటే.. నొప్పి నివారిణి మాత్రలతో నొప్పినుంచి ఉపశమనం పొందుతూ, నడుము యాంజెనాకు సరైన వెద్య చికిత్స తీసుకోకపోవటం వల్ల పాదం కోల్పోయే ప్రమాదం తలెత్తుతుంది. రెండోవెపు- మూత్రపిండాల వైఫల్యం తెలెత్తే అవకాశం పెరుగుతుంది. పెయిన్ కిల్లర్లను ఎక్కువెక్కువగా వాడటమే ఇలాంటి సమస్యకు కారణం. ప్రత్యేకించి మధుమేహుల్లో పెయిన్ కిల్లర్లు కిడ్నీ వెఫల్యానికి దారితీస్తాయి. కొంతలో కొంత ప్యారసెటమాల్ వంటివే కిడ్నీలకు సురక్షితమైన మాత్రలుగా తేలాయి.


# చాక్లెట్ తింటే మధుమేహం దూరం!



లండన్ః రోజూ వంద గ్రాముల చాక్లెట్ తిని మధుమేహాన్ని దూరం చేసుకోవచ్చంటున్నారు తాజా అధ్యయనకారులు. త్వరలో డాక్టర్లు కూడ ఇదో వైద్యంగా సలహా ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. డార్క్ చాక్లెట్ తీసుకోవడం ద్వారా ముధుమేహాన్ని నియంత్రించ వచ్చని లండన్ లోని వార్విక్ యూనివర్శిటీ జరిపిన పరిశోధనల్లో వెల్లడైంది. చాక్లెట్ లో ఉండే పదార్థాలు ఇన్సులిన్ లెవెల్స్ ను నియంత్రిస్తాయని తద్వారా గుండె జబ్బులు కూడ వచ్చే అవకాశం తగ్గుతుందని చెప్తున్నారు. వార్విక్ విశ్వవిద్యాలయం అధ్యయనకారులు 18 నుంచి 69 ఏళ్ళ మధ్య వయసుగల 1153 మందిపై నిర్వహించిన పరిశోధనల్లో తాజా విషయాలు వెలుగులోకి వచ్చాయి. చక్కెర వ్యాధి గ్రస్థులు ప్రతిరోజూ వంద గ్రాముల డార్క్ చాక్లెట్ తీసుకోవడం వల్ల మధుమేహం నియంత్రణకు సహకరించడంతోపాటు ఇతర హృద్రోగ సమస్యలు కూడ చాలావరకూ తగ్గే అవకాశం ఉందని లక్సెంబర్గ్ పరిశోధనల్లో తెలుసుకున్నారు. డార్క్ చాక్లెట్ తయారీకి వినియోగించే కోకోలో మధుమేహాన్ని నియంత్రించే శక్తి ఉన్నట్లు పరిశోధకులు కనుగొన్నారు. ప్రతిరోజూ 100 గ్రాముల చాక్లెట్ ను తీసుకోవడం వల్ల లివర్ లోని ఎంజైములు అభివృద్ధి చెంది, ఇన్సులిన్ ను నియంత్రించేందుకు తోడ్పడుతుందని పరిశోధకులు చెప్తున్నారు. అలాగే ఈ చాక్లెట్ ను ప్రతిరోజూ తీసుకునేవారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని, రోజుకు 28.8 గ్రాముల చొప్పున ప్రతిరోజూ తీసుకునే వారిలో చురుకుదనం పెరిగి ఉత్సాహంగా ఉన్నట్లు పరిశోధనల్లో తేలినట్లు చెప్తున్నారు.

అంతేకాక కోకో ఉన్న ఉత్పత్తులను తరచుగా తీసుకోవడం వల్ల కూడ గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండొచ్చని, ఇది గుండె మెటబాలిక్ కండిషన్ ను మెరుగు పరుస్తుందని వార్విక్ మెడికల్ స్కూల్ పరిశోధకుల సెవేరియో స్టేంజెస్ తెలిపారు. పరిశోధనా వివరాలను బ్రిటిష్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్ లో ప్రచురించారు.

# నిద్రలేమి సమస్యను నివారించే.. హెల్తీ బెడ్ టైమ్ డ్రింక్స్



**రాత్రుళ్ళు** నిద్రించడానికి సమస్యగా ఉందా? అలాంటి వారికోసం నిద్రలేమి సమస్యకు పరిష్కారం ఉంది. నిద్రలేమి సమస్యను నయం చేసుకోవడానికి వివిధ రకాల మందులు, వంటింటి చిట్కాలు, ఆయుర్వేద ట్రీట్మెంట్స్ మరియు ట్రిక్స్ తో ఇప్పటికి విసిగెత్తిపోయారా? అయితే ఇవన్నీ కాకుండా కొన్ని బెవరేజెస్ (పానీయాలను )మీరు ఎప్పుడైనా ట్రై చేశారా? ఈ పానియాలు మీరు రాత్రుల్లో త్రాగడం వల్ల గాఢంగా మరియు పీస్ ఫుల్ గా నిద్రించేలా చేస్తాయి. నిద్రకు



ఉపక్రమింపచేసే 13 ఆశ్చర్యకరమైన ఆహారాలు రీసెంట్ గా జరిగిన ఒక పరిశోధన ప్రకారం రాత్రి సమయాల్లో 8 రకాల పానీయాలు నిద్ర బాగా పట్టేందుకు ఉపయోగపడు తాయని కనుగొన్నారు . ఈ ఎఫెక్టివ్ డ్రింక్స్ మీరు గాఢంగా నిద్రపోయేలా చేయడం మాత్రమే కాదు, మరుసటి రోజు మీరు మరింత ఉత్సహాం, ఆరోగ్యంగా.. అందంగా కనబడేలా చేస్తాయి. వార్మ్ టీ, హెర్బల్ టీ , చాక్లెట్ టీ మరియు మరికొన్ని పానీయాల లిస్ట్ ను మీకోసం..మీరు ప్రయత్నించడం కోసం ఉన్నాయి. వీటిని ప్రయత్నించి మంచి నిద్రను పొందండి. ఇటు అనారోగ్యాన్ని... అటు నిద్రాభంగి మను కలిగించే 10 ఆహారాలు.. బాగా నిద్రపట్టాలంటే కాఫీకి దూరంగా ఉండాలి. ఇది మిమ్మల్ని మేల్కొనేలా చేస్తుంది. మరియు రాత్రుల్లో తీసుకొనే పానియాల్లో షుగర్ చేర్చకుండా తీసుకోవడం వల్ల మరింత యాక్టివ్ గా పనిచేస్తాయి.

మంచిగా నిద్రపట్టేలా చేస్తాయి. మరి 8 బెస్ట్ బెడ్ టైమ్ బెవరేజెస్ ఏంటో ఒక సారి ఈ క్రింది లిస్ట్ ద్వారా తెలుసుకుందాం. మంచి నిద్రతో మన ఆరోగ్యాన్ని కాపాడుకుందాం...

**హాట్ చాక్లెట్**: పాలలో హాట్ చాక్లెట్ సిరఫ్ ను మిక్స్ చేసి త్రాగడం వల్ల పొట్ట నిండుగా ఉన్న అనుభూతి కలిగిస్తుంది మరియు నరాలను విశ్రాంతి పరుస్తుంది.

**మింట్ టీ**: కొద్దిగా నిమ్మరంస మిక్స్ చేసి పుదీనా టీని త్రాగడం వల్ల చిన్న పిల్లలు నిద్రపోయినంత గాఢంగా మీరు నిద్రపోతారు. మీరు నిద్రించడానికి ఒక గంట ముందు ఈ టీని ప్రయత్నించండి.



**చామంతి టీ**: చమోమెలీ టి స్మూతింగ్ బెవరేజ్. రాత్రి పడుకొనే ముందు ఒక గంట ముందుగా త్రాగాలి. ఈ టీ త్రాగడం వల్ల నరాలను విశ్రాంతి పరుస్తుంది మరియు ఒత్తిడి తగ్గిస్తుంది.

**కోక్**: చాలా మంది ఎక్కువగా ఇష్టపడే మరో బెవరేజ్ హాట్ కోక్. నిద్రలేమితో బాధపడే వారు వేడిగా ఉండే కోక్ త్రాగితో స్మూత్‌గా నిద్రపట్టే స్తుంది. దీన్ని మీ డైలీ హ్యాబిట్ గా మార్చుకోవాలి.

**గోరువెచ్చని పాలు**: నిద్రలేమితో బాధపడుతు న్నట్లైతే మీరు ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో ఒక స్పూన్ హనీ మిక్స్ చేసి నిద్రించడానికి ఒక గంట ముందు త్రాగితే మంచి నిద్రపడు తుంది.

**బాదం మిల్క్**: బాదం మిల్క్ లో విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల, బాదం పౌడర్ ను గోరువెచ్చని పాలలో మిక్స్ చేసి రాత్రి నిద్రించ డానికి ముందు త్రాగాలి.

**హనీ మిల్క్**: ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో ఒక టేబుల్ స్పూన్ తేనె మిక్స్ చేసి త్రాగడం వల్ల వెంటనే నిద్ర పట్టేస్తుంది.

**అల్లం టీ**: వేడి వేడి జింజర్ టీ త్రాగడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. పొట్ట లైనింగ్ కూల్ గా ఉంటుంది. గుడ్ నైట్ రెస్ట్ పొందుతారు.

# తమిళనాడులో 234 కిలోల బంగారం స్వాధీనం



చెన్నై: శాసనసభ ఎన్నికలు దగ్గరపడుతున్న తమిళనాడులో భారీ ఎత్తున బంగారం రవాణాను గుర్తించడం కలకలం రేపింది. శుక్రవారం అర్ధరాత్రి సేలం-చెన్నై హైవే మార్గంలో అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 234 కిలోల బంగారు ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో గత కొన్ని రోజులుగా రాష్ట్రమంతటా విస్తృత వాహన తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సేలం-చెన్నై జాతీయ రహదారిపై పెరియార్ ప్రాంతంలో ఎన్నికల నిఘా దళాలు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో చెన్నై నుంచి సేలం వైపు వస్తున్న ఓ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేస్తుండగా.. అందులో పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలను గుర్తించారు. ఈ బంగారానికి సరైన పత్రాలు లేకపోవడంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్ డ్రైవర్, మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నగలను చెన్నైలోని ఓ పేరున్న నగల దుకాణం నుంచి సేలంకు తీసుకెళ్తున్నామని, అక్కడ స్థానిక వ్యాపారులకు వీటిని సరఫరా చేయాలని సదరు వ్యక్తులు విచారణలో తెలిపారు.

అయితే ఆభరణాలకు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఘటనపై లోతుగా దర్యాప్తు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఓటర్లకు పంచేందుకే ఈ బంగారాన్ని తీసుకొస్తున్నారా? అన్న కోణంలో విచారించనున్నట్లు తెలిపారు.

# అలిపిరి బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం



తిరుపతి : అలిపిరిలో కిడ్నాప్‌కు గురైన ఆరేళ్ల బాలుడి కథ సుఖాంతమైంది. విజయవాడ రైల్వేస్టేషన్‌లో బాలుడ్ని కనుగొన్నారు పోలీసులు. ఈ నెల 27న అలిపిరి బస్టాండ్ వద్ద సాహూ అనే బాలుడ్ని కర్ణాటకలోని మున్నియనపల్లికి చెందిన శివప్ప అనే వ్యక్తి అపహరించిన సంగతి తెలిసిందే. శివప్పకు వి.కోటకు చెందిన కళావతితో వివాహం అయింది. వీరికి పుట్టిన నలుగురు పిల్లల్లో ముగ్గురు అనారోగ్యంతో చనిపోగా.. డిప్రెషన్‌కు గురయ్యాడు.

ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సాహూ ఆడుకుంటుండగా కిడ్నాప్ చేశాడు. నిందితుడ్ని గత 14 రోజులుగా పోలీసు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

అతడు బాలుడ్ని విజయవాడలో వదిలేశాడన్న సమాచారంతో అక్కడికి వెళ్లి బాలుడ్ని గుర్తించారు. బాలుడితో విజయవాడ నుంచి తిరుపతి బయలుదేరారు.





విశాఖ నగరానికి చెందిన ప్రముఖ ఆడిటర్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జి.వి.ఆర్ కుమారుడు అకాల మరణం చెందిన సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్ల స్వగ్రామంలోని జివిఆర్ నివాసం లో వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చొక్కకుల వెంకట్రావు, లీగల్ సెల్ ప్రతినిధి కరణం కృష్ణ, విజయభాను తెలుగు దినపత్రిక బ్యూరో చీఫ్ సనపల చిన్నబాబు, చిరంజీవి గన్నమనేని చైతన్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని చొక్కకుల నివాళులర్పించారు.

# రెండో టీ20 భారత క్రికెట్ జట్టులో భారీ మార్పులు!




అహ్మదాబాద్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టీ20లో అనవసరపు ప్రయోగాలు చేసి చావుదెబ్బ తిన్న భారత్.. రెండో టీ20 కోసం జట్టులో భారీ మార్పులు చేయాలని యోచిస్తోంది. 5 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రేపు(ఆదివారం) ఇంగ్లండ్‌తో జరుగబోయే రెండో మ్యాచ్‌లో రోహిత్ శర్మను తుది జట్టులోకి ఎంపిక చేయాలని జట్టు మేనేజ్‌మెంట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. తొలి మ్యాచ్‌లో ముగ్గురు స్పిన్నర్లను రంగంలోకి దించి చేతులు కాల్చుకున్న భారత్.. ఈసారి జట్టు కూర్పు విషయంలో పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. తొలి మ్యాచ్‌లో అంతగా ప్రభావం చూపని లెగ్ స్పిన్నర్ చాహల్, పేసర్ శార్థూల్ ఠాగూర్‌ల స్థానాల్లో లెగ్ బ్రేక్ బౌలర్ రాహుల్ చాహర్, మీడియం పేస్ బౌలర్ దీపక్ చాహర్‌లకు అవకాశం కల్పించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

కాగా, ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లను రొటేషన్ పేరుతో తప్పించి.. టెస్ట్ సిరీస్‌లో ఇంగ్లండ్ చేసిన తప్పిదమే భారత్ టీ20 సిరీస్‌లో చేస్తుందని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో టీమిండియా దిద్దుబాటు చర్యలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగానే రోహిత్ శర్మ రీ ఎంట్రీ, రాహుల్, దీపక్ చాహర్‌లకు తుది జట్టులో అవకాశం కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. గణాంకాల ప్రకారం చూసినా రోహిత్, రాహుల్‌ల జోడీకి ఓపెనర్లుగా మంచి ట్రాక్ రికార్డు ఉంది. ఈ నేపథ్యంలో వీరి జోడీ రెండో టీ20లో ఇన్నింగ్స్‌ను ప్రారంభించడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో 4 ఓవర్లలో 44 పరుగులిచ్చిన చాహల్ స్థానంలో దేశవాళీ టోర్నీలో మంచి ఫామ్‌ను కనబర్చిన రాహుల్ చాహర్‌ను, తొలి మ్యాచ్‌లో కేవలం 2 ఓవర్లు మాత్రమే వేయగలిగిన శార్థూల్ స్థానంలో పేసర్ దీపక్ చాహర్‌కు అవకాశం కల్పించాలని జట్టు యాజమాన్యం యోచిస్తోంది.

# ఆంధ్ర రాష్ట్రాన్ని బీజేపీ చిన్నచూపు చూస్తోంది

## - బ్రిటిష్ పాలనను మించిపోయిన బీజేపీ పాలన

## - ఏపీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి



విశాఖపట్నం : ఆంధ్ర రాష్ట్రాన్ని కేంద్రప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రవేటీకరణకు వ్యతిరేకంగా దేశరాజధాని ఢిల్లీలో ఏపీ భవన్ వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమానికి మద్దతుగా రమణి కుమారి ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ సందర్భంగా పేడాడ రమణి కుమారి మాట్లాడుతూ దేశంలో బ్రిటిష్ పాలన కన్నా మించిపోయిందని బిజెపి ప్రభుత్వాన్ని అన్నారు. అప్పుడు భారతదేశాన్ని బ్రిటిష్ వారు పాలించే సమయంలో కూడా ప్రభుత్వ ఆస్తులను కంపెనీలను లీజుకు ఇచ్చేవారు కానీ ఎవరికి అమ్మటం గానీ జరిగేది కాదు కానీ ఇప్పుడు బిజెపి ప్రభుత్వం మాత్రం ప్రైవేటీకరణ అని చెప్పి ప్రభుత్వ ఆస్తులను భూములను కంపెనీలను దేశంలో ఉన్న పెద్దపెద్ద ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్మి వేస్తున్నారని ఇలా అమ్ముకుంటే పోతే కొద్దిరోజుల్లో దేశంలోని ప్రభుత్వ సంబంధించి ఎటువంటి ఆస్తి గాని కంపెనీలు గాని ఉండవని అంత ప్రైవేటు యాజమాన్యం ఆధ్వర్యంలో వెళ్ళిపోతుందని ఆమె తెలియజేశారు. కనుక ప్రజలందరూ మేలుకొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరుగుతున్న ధర్నా జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం కళ్ళు తెరుచుకుని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలని లేకపోతే దీనికి తగిన మూల్యం వచ్చే ఎన్నికల్లో చెల్లించుకోవలసి వస్తుందని రానున్న ఎన్నికల్లో ప్రజలు బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని ఆమె శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ కు అడుగడుగునా అన్యాయంచేస్తున్నారని ఆ ప్రకటనలో విమర్శించారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీ సేవిధంగా విశాఖ ఉక్కును వంద శాతం ప్రవేటీకరణకు పూనుకొంటున్నామని కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించడం బీజేపీ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు అద్దంపడుతోందన్నారు.పార్లమెంట్ సాక్షిగా ప్రకటించిన విభజన హామీలను తుంగలోకి తొక్కారని మండిపడ్డారు.న్యాయబద్దంగా ఇవ్వాల్సిన ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయంగా బీజేపీ నేతలు ప్రకటిస్తున్నారన్నారు. పోలవరానికి రావాల్సిన నిధులను కూడా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. రైల్వే జోన్,మెట్రో రైల్ ఊసే ఎత్తటం లేదని విమర్శించారు.ప్రత్యేక హోదా,రైల్వే జోన్, విశాఖ ఉక్కు పై ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు.న్యాయబద్దంగా రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను,హక్కుల కోసం పోరాటం చెయ్యాల్సిన జగన్ స్వంత ప్రయోజనాలకోసం మోడీ ముందు మోకరిల్లుతున్నారని రమణి కుమారి దుయ్యబట్టారు.కాంగ్రెస్ శాంతియుతంగా నిరసన తెలుపుతుందని,ప్రత్యేక హోదా సాధించేంతవరకూ, విశాఖ ఉక్కు ప్రవేటీకరణ రద్దుచేసేంతవరకు కాంగ్రెస్ పోరాడుతుందని తెలిపారు.

# విమాన ప్రయాణికులకు కొత్త రూల్స్



దిల్లీ: దేశంలో కరోనా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లే కన్పిస్తోంది. కొంతకాలంగా రోజువారీ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. వైరస్ ఉద్ధృతి ఎక్కువగా ఉంటున్నప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో కరోనా నిబంధనలను పాటించట్లేదు. ఈ నేపథ్యంలో కేంద్ర పౌరవిమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ అప్రమత్తమైంది. విమాన ప్రయాణికులకు కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ప్రయాణికులు తప్పనిసరిగా మాస్కులు ధరించాల్సిందేనని, లేదంటే విమానం నుంచి దించేయాలని స్పష్టం చేసింది. పదే పదే నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విమానయాన సంస్థలను ఆదేశించింది. ఈ మేరకు శనివారం ఓ సర్క్యులర్ జారీ చేసింది.

**డీజీసీఏ నూతన ఆదేశాలివే..**

విమాన ప్రయాణాల సమయంలో ప్రయాణికులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. సామాజిక దూరం పాటించాలి. ఆ మాస్కులు ముక్కు కిందకు ఉండకూడదు. సరిగ్గా ధరించాలి.

విమానాశ్రయ ప్రవేశద్వారాల వద్ద సీఐఎస్ఎఫ్, పోలీస్ సిబ్బంది ప్రయాణికులను గమనించాలి. మాస్క్ లేకుండా ఎయిర్‌పోర్టు లోపలికి ఎవర్నీ అనుమతించకూడదు.

విమానాశ్రయ ప్రాంగణంలో ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించేలా, సామాజిక దూరం పాటించేలా ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ లేదా టర్మినల్ మేనేజర్ చూసుకోవాలి. ఏ ప్రయాణికుడైనా కొవిడ్ 19 నిబంధనలు పాటించకపోతే వారిని భద్రతా సిబ్బందికి అప్పగించాలి.

విమానంలోకి ఎక్కిన తర్వాత అందరూ మాస్కులు పెట్టుకునేలా చూసుకోవాలి. సిబ్బంది హెచ్చరించినా మాస్క్ పెట్టుకోకపోతే ఆ ప్రయాణికులను టేకాఫ్‌కు ముందే విమానం నుంచి దించేయాలి.

ప్రయాణ సమయంలో విమానంలో కొవిడ్ నిబంధనలు పదే పదే ఉల్లంఘించినట్లయితే వారిని 'నిషేధిత జాబితాలోని ప్రయాణికుడి'గా పరిగణించాలి. సదరు విమానయాన సంస్థ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

# పొలిటికల్ ఎంట్రీపై స్పందించిన ఎన్టీఆర్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ రాజకీయ రంగ ప్రవేశం ప్రస్తుతం ఆసక్తిగా మారింది. తదుపరి ఎన్నికల నాటికి ఎన్టీఆర్ పొలిటికల్ ఎంట్రీ ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇంతవరకు దీనిపై ఆయన ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. కాగా ఆయన హోస్ట్‌గా వ్యవహరిస్తున్న రియాల్టీ షో 'ఎవరు మీలో కోటీశ్వరుడు' త్వరలో జెమిని టీవీలో ప్రసారం కానుంది. ఈ షోకు సంబంధించిన ప్రోమోను జెమిని టీవీ తాజాగా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్‌తో ప్రెస్‌మీట్ జరిగిన సంగతి తెలిసిందే.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ పొలిటికల్ ఎంట్రీపై స్పందించారు. 'మీ పొలిటికల్ ఎంట్రీ ఎప్పుడు'అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఎన్టీఆర్ తనదైన శైలిలో స్పందించారు. 'దీనికి మీరే సమాధానం చెప్పాలి. ఈ ప్రశ్నకు నేను ఏ సమాధానం చెబుతానో కూడా మీకు తెలుసు' అంటూ ప్రశ్న దాటేశారు. అయితే రాజకీయాల గురించి మాట్లాడేందుకు ఇది సమయం, సందర్భం కాదని, దీని గురించి మరొసారి తీరిగ్గా కాఫీ తాగుతూ చర్చించుకుందామంటూ సమాధానం ఇచ్చారు.

ప్రస్తుతం ఎన్టీఆర్ దర్శక ధీరుడు రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఆర్ఆర్ఆర్ షూటింగ్‌లో పాల్గొంటూ బిజీగా ఉన్నారు. ఇందులో ఆయన కొమురం భీం పాత్రలో కనిపించనున్నాడు.

# అర్ధరాత్రి వాలంటీరు దారుణ హత్య

కూడేరు: అనంతపురం జిల్లా కూడేరు మండలంలో దారుణం జరిగింది. పొలం వద్ద నిద్రిస్తున్న శివరాంపేట గ్రామానికి చెందిన వాలంటీరు శ్రీకాంత్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చారు. ఉదయం అటుగా వెళ్తున్న కొందరు శ్రీకాంత్ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

అర్ధరాత్రి సమయంలో గునపంతో పొడిచి వాలంటీరును హత్య చేసినట్టు అతని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. శ్రీకాంత్ తండ్రిని చంపబోయి అతని కుమారుడిపై దాడి జరిగిందని అనుమానిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com